RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 251 ISSUE NO : 251 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | గురువారం, ఏప్రిల్,2, 2026 Thursday, April, 2 , 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



కొండను ఢీకొట్టిన..

## రష్యా విమానం

### సిబ్బంది సహా 29 మంది మృతి

మాస్కో : రష్యా సైన్యానికి చెందిన ఏఎన్-26 రవాణా విమానం క్రిమియా ద్వీపకల్పంలో కుప్పకూలింది. ఈ ఘోర ప్రమాదంలో విమానంలోని ఆరుగురు సిబ్బంది, 23 మంది ప్రయాణికులు సహా మొత్తం 29 మంది మరణించినట్లు రష్యా రక్షణ శాఖ బుధవారం తెల్లవారు జామున ధ్రువీకరించింది. విమానం నేరుగా ఒక కొండను ఢీకొట్టినట్లు ఘటనా స్థలంలోని ఒక అధికారి టాస్ వార్తా సంస్థకు తెలిపారు. రక్షణ శాఖ కథనం ప్రకారం మార్చి 31వ తేదీ మంగళవారం మాస్కో కాలమానం ప్రకారం సాయంత్రం 6 గంటల సమయంలో షెడ్యూల్ ప్రకారం ప్రయాణిస్తున్న ఏఎన్-26 విమానంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి.



బీజేపీ ఓటు బ్యాంకు విజయన్‌కు బదిలీ అయ్యేలా

## మోదీ ప్రయత్నిస్తున్నారు

### కేరళలో ప్రచారంలో రేవంత్ రెడ్డి

తిరువనంతపురం: కేరళలో బీజేపీ ఓటు బ్యాంకు సీఎం పినరయి విజయన్‌కు బదిలీ అయ్యేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తిరువనంతపురంలోని ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయ న్‌కు తేడా ఏమీ లేదని ఆయన విమర్శిం చారు. కేరళ ప్రజలు చాలా తెలివైనవారని, విద్యావంతులను, మతతత్వ శక్తులను అస్సలు అనుమతించరని అన్నారు. బీజేపీ లాంటి పార్టీలు అధికారంలోకి రాకుండా కేరళ ప్రజలు లక్ష్మణ రేఖ గీశారని వ్యాఖ్యానించారు. కేరళకు భవిష్యత్తు లేకుండా చేయాలని మోదీ, పినరయి విజయన్ చూస్తున్నారని ఆరోపించారు. అందుకే బీజేపీ ఓటు బ్యాంకును ఎల్డీఎఫ్‌కు బదిలీ అయ్యేలా చూస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కేరళలో పినరయి విజయన్ సమయం అయిపోయిందని, యూడీఎఫ్ సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావడానికి అవకాశమే లేదని అన్నారు. ఎన్నికల తర్వాత ఇక్కడ పాలించేది కాంగ్రెస్ పార్టీయేనని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది తమ పార్టీయేనని అన్నారు.



నేడు నగరంలో హనుమాన్

## శోభాయాత్ర..

### 3వేల మందితో పోలీస్ బందోబస్తు

హైదరాబాద్, ఏప్రిల్1,తెలంగాణ దిశ : నగరంలో హనుమత్ జయంతికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక పోతే గురువారం హనుమత్ జయంతి సంద ర్భంగా శోభాయాత్ర నిర్వహించడం ఏటా ఆన వా యితీగా వస్తోంది. ఏప్రిల్ 2న హనుమాన్ శోభా యాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వా హకులతో సమన్వయ సమావేశం నిర్వహించాక పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సుమారు 3వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామ న్నారు.యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు.


ఒంటిమిట్టలో ఘనంగా

## బ్రహ్మోత్సవాలు..

### శివధనుర్భంగాలంకారంలో శ్రీ కోదండరాముడు

ఒంటిమిట్ట, ఏప్రిల్1 : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం ఉదయం శివధనుర్భంగాలంకారంలో శ్రీ కోదండ రాముల వారి రాజసం భక్తులకు కనువిందు చేసిం ది. ఉదయం 7.30 గంటల నుండి స్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజన లు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుం డగా, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది.





హైదరాబాద్‌లో 'హైడ్రా'

## కొరడా

### రూ.100 కోట్ల ప్రభుత్వ భూమికి విముక్తి

హైదరాబాద్,తెలంగాణ దిశ: హైదరాబాద్‌లో ప్రభు త్వ భూముల పరిరక్షణకు ఏర్పాటు చేసిన 'హైడ్రా' మరో భారీ ఆపరేషన్ చేపట్టింది. రాజేంద్రనగర్ మండలం శాస్త్రిపురంలో ఆటస్థలం కోసం కేటా యించిన ప్రభుత్వ భూమిలో అక్రమం గా నిర్మించిన ఐదు భవనాలను ఇవా ళ కూల్చివేసింది. భారీ భద్రత నడుమ ఈ కూల్చివేత ప్రక్రియను పూర్తిచే శారు. స్వాధీనం చేసుకున్న ఈ భూమి విలువ సుమారు రూ. 100 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తు న్నారు. వివరాల్లోకి వెళితే... హుడా (హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఆమోదించిన 188 ఎకరా లలేఅవుట్‌లో 6,500చదరపు గజాల స్థలాన్ని ఆటస్థలం కోసం కేటాయిం చారు. అయితే, కొందరు వ్యక్తులు ఈ భూమిని కబ్జా చేసి, నకిలీ నోటరీ ప త్రాలతో ఇతరులకు ప్లాట్లుగా విక్ర యించారు. ఈ స్థలంలో నిర్మాణంలో ఉన్న ఐదు Go3 భవనాలతో పాటు మరో రెండు చిన్న నిర్మాణాలను..

కరీంనగర్,తెలంగాణ దిశ : కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై వివాదాస్పద, మతపరమైనవ్యాఖ్యలు చేసిన కేసులో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 4న విచారణకు రావాలని ఆదేశించింది. ఈనోటీసులపై స్పందించిన కౌశిక్ రెడ్డి.. ఇదిరాజకీయ కక్ష సాధింపు అనితన కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడం సరికాదని రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని.. ప్రజల తరపున తన పోరాటం ఆపనని ఆయన స్పష్టంచేశారు.హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి చిక్కులు తప్పటం లేదు. ఇప్పటికే అసెంబ్లీలో కడియం శ్రీహరిని బెదిరించారన్న ఆరోప ణలతో ఆయనపై చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. తాజాగా.. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు జారీ చేసింది. వచ్చే నెల ఏప్రిల్ 4న హైదరాబాద్‌లోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 29న వీణవంక మండలంలో జరిగిన మినీ మేడారం జాతర సందర్భంహౌగా బందోబస్తులో ఉన్న పోలీసులకు,ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి మధ్యతీవ్ర వాగ్వాదం జరిగింది.శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు తనను, తన కుటుంబాన్ని జాతర వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారని కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను ఉద్దేశించి ఆయన మతంపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.



టార్గెట్ కౌశిక్ రెడ్డి..!

## బిగుస్తున్న ఉచ్చు



అజార్ కు అమాత్య..యోగం

## ఉన్నట్టా.. లేనట్టా..!

హైదరాబాద్,తెలంగాణ దిశ : అజారుద్దీన్ మంత్రి పదవి ఉంటుందా.. ఊడుతుందా.. తెలంగాణ రాజకీయవర్గాల్లో జోరుగా వినిపిస్తున్న చర్చ ఇది. దీనికి కారణం.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఫైల్ ఇప్పటికీ పెండింగ్‌లో ఉండడమే ! ఏ చట్టసభల్లో సభ్యుడిగా లేకపోయినా.. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా అజారుద్దీన్‌ను మంత్రిని చేసింది కాంగ్రెస్ సర్కార్. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ చేస్తూ రేవంత్ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఆ ఫైల్ గవర్నర్ దగ్గరే ఉంది. మంత్రి పదవి కొనసాగాలంటే.. ఆరు నెలల్లోగా శాసనసభ లేదా శాసన మండలిలో అజారుద్దీన్‌కు సభ్యత్వం తప్పనిసరి. ఐతే వచ్చే నెల 30వ తేదీతో.. ఆయన మంత్రి పదవి చేపట్టి ఆరు నెలలు ముగుస్తుంది. ఇంకా 30 రోజులు మాత్రమే టైమ్ ఉండటంతో.. ఇప్పుడేం జరగబోతుందనేది ఆసక్తి రేపుతోంది. గవర్నర్ దగ్గర ఫైల్ ఇలానే పెండింగ్‌లో ఉంటే పరిస్థితి ఏంటనే చర్చ జరుగుతోంది. ఐతే దీనికి రేవంత్ సర్కార్ ప్లాన్ బీ సిద్ధం చేసిందనే టాక్ నడుస్తోంది.అక్టోబర్ 31న తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ రోజు నుంచి 6 నెలల లోపు చట్టసభల్లో సభ్యుడు కావాలి. అంటే ఏప్రిల్ 30లోపు ఆయన చట్టసభల్లో సభ్యుడు కావాలన్న మాట. నాలుగు నెలల కిందటే.. కేబినెట్ ఆమోదించి గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అజారుద్దీన్‌ను నామినేట్ చేసింది. ఐతే బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ సుప్రీంకోర్టులో కేసు వేశారు.

హైదరాబాద్,తెలంగాణ దిశ : కవిత కొత్త పార్టీ దాదాపు ఖాయమైపోయింది. ఆమె తన రాజకీయ ప్రయాణాన్ని ఒంటరిగానే మొదలు పెట్టడానికి సిద్ధ మయ్యారు. మొదట్లో ఉగాది తర్వాత పార్టీ ఏర్పాటు చేస్తారని ప్రచారం జరిగింది. ఇటీవల ఆమె పార్టీకి సంబంధించిన కొన్ని వ్యవహారాలు లీగల్ ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. అయితే ఇప్పుడు ఆ సమస్యలు మొత్తం క్లియర్ కావడంతో రాజకీయ పార్టీ ఏర్పాటుకు కవిత శ్రీకారం చుట్టినట్టు కనిపిస్తోంది.కవిత రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఆమె వెంట ఎవరు వస్తారు.. ఆమెతో ఎవరు ఉంటారు.. ఆమె కోరుకున్నట్టుగా తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో రాజకీయ శున్యత కనిపిస్తోందా.. అనే ప్రశ్నలను రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. అయితే వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



కవితతో..

## వచ్చేదెవరు..?

# శస్త్ర చికిత్స చేయించుకున్న గురుక్కల్‌ను పరామర్శించిన ఎమ్మెల్యేలు







**హైదరాబాద్, ఏప్రిల్ 01, (తెలంగాణ దిశ)** :నగరంలోని స్టార్ హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స చేయించుకున్న గురుక్కల్‌ను బుధవారం ఎమ్మెల్యేలు పరామర్శించారు. ఇందులో భాగంగాఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ బుధవారం స్టార్ హాస్పిటల్స్ లో చికిత్స పొందుతున్న తిరునల్లార్ శ్రీ దర్బారన్యేశ్వర స్వామి దేవస్థానం పూజారి మహాలింగ గురుక్కల్ ను పరామర్శించారు. గురుక్కల్ కు ఇటీవల జరిగిన హృదయ శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తవ్వడం పట్ల ఎమ్మెల్యేలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి కుమారుడు దిలీప్ స్వామికి ధైర్యం చెప్పారు. అనంతరం గురుక్కల్ ఆశీర్వచనాలను స్వీకరించారు. అదే విధంగా స్టార్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ గుడపాటి రమేష్ ను మహాలింగ గురుక్కల్ సన్మానించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, ఉప్పలపాటి శ్రీకాంత్, నర్నె శ్రీనివాస్ రావు, సోలిస్ కంటి హాస్పిటల్ చైర్మన్ నందనంపాటి రాము, అరికపూడి ప్రసాద్, మహేష్ గౌడ్, నవీన్ గౌడ్, శంకర్ బాబు, రామకృష్ణ, సుబ్బా రావు, లక్ష్మణ్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

## జై జవాన్ కాలనీలో దోమల నివారణకు చర్యలు



**ఏఎస్ రావునగర్, ఏప్రిల్ 01, (తెలంగాణ దిశ)** :ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని జై జవాన్ కాలనీలో గత కొన్ని నెలలుగా దోమల సమస్య తీవ్రంగా పెరిగి కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఈ సమస్యపై సంబంధిత ఎంఎంసి కాప్రా సర్కిల్ అధికారులు స్పందించకపోవడంతో కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఏఎస్ రావునగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన ఎంఎంసి కాప్రా సర్కిల్ అధికారులతో మాట్లాడి కాలనీలో ఫాగింగ్ మిషన్‌ను పంపించి గల్లీ గల్లీగా దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. దీంతో కాలనీవాసులు ఊరట చెందారు. దీనిపై జై జవాన్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కేశెట్టి ప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# 4న శిల్పానగర్ శ్రీ వెంకట మరకత చంద్రమౌళీశ్వర హనుమాన్ దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

### - ప్రముఖులకు ఆహ్వాన పత్రికల అందజేత





**నాగారం, ఏప్రిల్ 1 (తెలంగాణ దిశ):** నాగారం 7వ వార్డులోని శిల్పా నగర్ కాలనీలో ఉన్న శ్రీ వెంకట మరకత చంద్రమౌళీశ్వర హనుమాన్ దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 4న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ బుధవారం పలువురు ప్రముఖులకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలి పెద్ది సుధీర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, ఘట్కేసర్ సర్కిల్ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డిలకు ఆహ్వాన పత్రికలను అందజేసి వేడుకలకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గూడూరు ఆంజనేయులు గౌడ్, మాజీ కౌన్సిలర్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కౌకుట్ల అనంత రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మోకు జగన్మోహన్ రెడ్డి, కొమురెల్లి సుధాకర్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# కుషాయిగూడ కంఠమయ్య దేవాలయాన్ని అభివృద్ధి చేయాలి

### - కలెక్టర్ కు కలిసి వినతిపత్రం అంద చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి



**కుషాయిగూడ, ఏప్రిల్ 01, (తెలంగాణ దిశ)** :గౌడ కులస్తుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం కుషాయిగూడ లో ఉన్న గౌడ కులస్థుల ఆరాధ్యదైవమైన శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి కోసం యుద్ధ ప్రాతిపదికన రెండు కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయాలని మేడ్చల్ కలెక్టర్ మను చౌదరికు కుషాయిగూడ గౌడ సంఘం నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ సీనియర్ నాయకులు పాండల శివకుమార్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు నేమురి మహేష్ గౌడ్, గౌడ సంఘం నాయకులు తాళ్ల వెంకటేష్ గౌడ్, బుడంపల్లి రఘు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కుషాయిగూడలో మహిళ అదృశ్యం...



**కుషాయిగూడ, ఏప్రిల్ 01, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నార్త్ కమలానగర్‌కు చెందిన గంప శ్రీనివాస్ (40), సెంట్రల్ గవర్నమెంట్ కెవి స్కూల్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతనికి 2012లో తన మేనమామ కుమార్తె గంప కృష్ణవేణి (33)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. గత కొద్ది రోజులుగా దాంపత్య విషయాల్లో భార్యాభర్తల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. మార్చి 31న ఉదయం శ్రీనివాస్ పనికి వెళ్లగా, పిల్లలు కూడా పాఠశాలకు వెళ్లారు. ఈ సమయంలో కృష్ణవేణి తన మామకు ఫోన్ చేసి తాను పనికి ఆలస్యంగా వెళ్తానని తెలిపింది. మధ్యాహ్నం పిల్లలు ఇంటికి వచ్చేసరికి తల్లి ఇంట్లో లేకపోవడంతో ఫోన్ చేయగా, షాపింగ్‌కు వెళ్లానని, వస్తానని చెప్పింది. అయితే తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ అవ్వడంతో శ్రీనివాస్ అనుమానం వ్యక్తం చేశాడు. మధ్యాహ్నం పనిముగించుకుని ఇంటికి వచ్చినప్పటికీ ఆమె తిరిగి రాకపోవడంతో బంధువులు, పరిచయస్తుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అదృశ్యమైన కృష్ణవేణి ఎత్తు సుమారు 5 అడుగుల 4 అంగుళాలు ఉండి, తెలుగుతో పాటు హిందీ కూడా మాట్లాడగలదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన కుషాయిగూడ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఏప్రిల్ ఒకటి నుంచి మీ సేవా కొత్త ఛార్జీల అమలు

**హైదరాబాద్, ఏప్రిల్ 01, (తెలంగాణ దిశ)** : తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలోని మీ సేవ సేవలకు సంబంధించిన యూజర్ ఛార్జీలను సవరించినట్లు అధికారులు తెలిపారు. కొత్త రేట్లు ఏప్రిల్ ఒకటి నుంచి నుండి అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. కేటగిరీ-బి సేవలకు యూజర్ ఛార్జీ రూ.80గా నిర్ణయించగా, ఆదాయ, కమ్యూనిటీ, రెసిడెన్స్ సర్టిఫికేట్లు, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ వంటి ప్రధాన సేవలకు ఇదే రేటు వర్తించనుంది. కొన్ని సేవలకు 7 నుంచి 30 పని రోజుల వరకు ఎస్ఎల్ఏ సమయం నిర్ణయించారు. కేటగిరీ-ఎ సేవలకు యూజర్ ఛార్జీ రూ.62గా ఉండగా, సర్టిఫికేట్ రీ-ఇష్యూ, ఎన్కంబ్రెన్స్ సర్టిఫికేట్ (ఈసి), బర్త్ సర్టిఫికేట్ ప్రింట్ వంటి సేవలు ఇందులో ఉన్నాయి. వీటిలో కొన్ని సేవలు తక్షణమే అందుబాటులో ఉండగా, మరికొన్నింటికి ఒక పని రోజు సమయం ఉంటుంది. అదే విధంగా, బిల్ పేమెంట్ సేవలకు వేర్వేరు ఛార్జీలు నిర్ణయించారు. ఈ పాస్ బయోమెట్రిక్ ధృవీకరణకు రూ.35, రైతు నమోదు సేవకు రూ.18 వసూలు చేయనున్నారు. ఇతర చెల్లింపులకు రూ.62 వరకు ఫీజు ఉంటుంది. స్కానింగ్, ప్రింటింగ్ సేవలకు మొదటి నాలుగు పేజీల తర్వాత ప్రతి పేజీకి రూ.2.50 చొప్పున వసూలు చేయనున్నారు. నిర్ణయించిన ఫీజుల కంటే ఎక్కువ వసూలు చేసినట్లయితే 1100/18004251110 నంబర్లకు ఫిర్యాదు చేయాలని ప్రభుత్వం సూచించింది. ప్రజలకు పారదర్శక సేవలందించడమే లక్ష్యంగా ఈ సవరణలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.


# సన్న బియ్యం పథకం ఏడాది పూర్తి... అశోక్ నగర్ లో కాంగ్రెస్ సంబరాలు



**హెచ్ బి కాలనీ, ఏప్రిల్ 01, (తెలంగాణ దిశ)** :తెలంగాణలో రేవంత్ రెడ్డినాయకత్వంలోని ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ప్రారంభించినసన్న బియ్యం పథకం విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని అశోక్ నగర్ లో బుధవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు అశోక్ నగర్‌లో డీలర్ బాల విశ్వనాథం రేషన్ షాప్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనందోత్సాహాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీనాయకులు మొసలి శ్రీనివాస్ రెడ్డి, విక్టరీ జోష్, బాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొని పథకం విజయాన్ని కొనియాడారు. పేద ప్రజలకు మెరుగైన ఆహార భద్రత అందించడంలో ఈ సన్న బియ్యం పథకం కీలక పాత్ర పోషిస్తోందని నాయకులు పేర్కొన్నారు.

# పార్కింగ్ విషయంలో యువకుల మధ్య ఘర్షణ

### - ముక్కులో బొక్కలు తునతునకలు
### - ఐదు సర్జరీలు చేయాలి : డాక్టర్లు



**కుషాయిగూడ, ఏప్రిల్ 01, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని డాక్టర్ ఏఎస్ రావునగరలోని పరివార్ హోటల్ పక్కనే ఉన్న రిలయన్స్ డిజిటల్ ప్రాంగణంలో పార్కింగ్ విషయంలో ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ జరిగింది. బైక్ పక్కకు జరపమన్నందుకు కుషాయిగూడ కు చెందిన మామిడి సంతోష గౌడ్ పై దాడి చేశారు. చేతికి పెట్టుకునే కడియంతో ముక్కుపై ఇద్దరు యువకులు గుద్దడంతో ముక్కులో బొక్కలు పునతునకలు అయ్యాయి. ఐదు సర్జరీలు చేయాల్సిన అవసరం ఉందని డాక్టర్లు తెలిపారు. బాధితులు ప్రస్తుతం ఈసీఐఎల్ చౌరస్తాలోని జీనియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడిని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లుకు సూచించారు. ఈ మేరకు కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అరటి ఎగుమతులు ఢమాల్

### దేశయంగా ముందుకు రాని కొనుగోలుదారులు
### ఆందోళనలో జిల్లా అరటి రైతులు



**అనంతపురం,తెలంగాణ దిశ** :పశ్చిమ దేశాల్లో కొనసాగుతున్న యుద్ధంతో అరటి రైతులు కుదేలవుతున్నారు. ఎగుములు ఆగి, ధరలు పడివపోవడంతో పలు చోట్ల అరటి రైతులు ఆందోళనకు దిగారు. తమ పంటలను కొనుగోలు చేయాలని కోరుతున్నారు. 20 రోజుల క్రితం ఆశాజనకంగా ఉన్న అరటి ధర ఉన్నఫలంగా పడిపోయింది. కిలో రూ.5కు కూడా కొనే నాథుడు కరువవ్వడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అరటి సాగు గణనీయంగా ఉంది. తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. దాదాపు 47 వేల ఎకరాల్లో ఈ ఏడాది అరటి సాగైంది. ఫిబ్రవరిలో కిలో రూ.22 నుంచి రూ.24 వరకు ధర పలికింది. వారం రోజులుగా అరటిపై యుద్ధం నీడలు కమ్ముకోవడంతో ఎగుమతి పూర్తిగా ఆగిపోయింది. కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతదో తోటల్లోనే అరటి కాయలు వాడిపోతున్నాయి.

# చెత్త తరలింపులో డంప్ యార్డ్‌కు స్వస్తి

### విశాఖలో నేరుగా ఎనర్జీ ప్లాంట్‌కు చెత్త
### గాజువాక పర్యటనలో మంత్రి నారాయణ వెల్లడి



**విశాఖపట్నం,తెలంగాణ దిశ** :విశాఖ నగరంలో డంపింగ్ యార్డు అవసరం లేకుండా ఎప్పటికప్పుడు చెత్తను వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు తరలిస్తున్నామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గాజువాకలో 4.75 ఎకరాల విస్తీర్ణంలో అన్ని రకాల వసతులతో పార్క్‌ను ప్రారంభించామని చెప్పారు. గత ప్రభుత్వం మున్సిపల్ శాఖనుపూర్తిగా నిర్వీర్యం చేసిందని మంత్రి నారాయణ విమర్శించారు. మున్సిపాలిటీల్లో ప్రజలు కట్టిన పన్నులను ఇతర అవసరాలకు మళ్లించేసిందన్నారు. గాజువాకలో మంత్రి నారాయణ మంగళవారం ఉదయం పర్యటించారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గాజువాక జోన్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించారు. అలాగే 76వ వార్డులోని హెచ్‌బీ కాలనీలో అల్లూరి సీతారామరాజు పార్క్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పక్కదారి పట్టించిన 1700 కోట్ల రూపాయల నిధులు ఇంకా మున్సిపాలి టీలకు రాలేదని మంత్రి తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాలిటీల నిధులు అక్కడే ఖర్చు చేసేలా గ్రీన్ ఛానల్ తీసుకొచ్చామని వివరించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు రూ.14 వేల కోట్లతో టెండర్లు పిలిచామని చెప్పారు. రాబోయే రెండేళ్లలో మున్సిపాలిటీల్లో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. రూ.5000 కోట్లతో పలు నగరాల్లో పక్కా డ్రెయిన్లు నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు.

# ఆస్తిపన్ను చెల్లింపుదారులకు శుభవార్త

### వడ్డీలో 50-శాతం రాయితీ కల్పించిన ఎపి ప్రభుత్వం

**అమరావతి,తెలంగాణ దిశ** :మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ఆస్తి పన్ను బకాయిలు పెరిగిపోయిన నేపథ్యంలో బకాయిల వసూలు కోసం ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ జీవో నెంబర్ 58ని విడుదల చేశారు. దీని ప్రకారం ఈ నెల 31 తేదీలోగా బకాయిలు పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీలో 50 శాతం రాయితీ లభిస్తుంది.

# ఎమ్మెల్యే మందుల శామ్యూల్ పై చర్యలు తీసుకోవాలి

### బ్రహ్మణ సంక్షేమ సమైఖ్య చేవెళ్ల శాఖ డిమాండ్

**రంగారెడ్డి,తెలంగాణ దిశ** : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ పై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవాలని బ్రహ్మణ సేవా సంఘం, సంక్షేమ సమైఖ్య చేవెళ్ల శాఖ అధ్యక్షులు వెంకటకృష్ణ డిమాండ్ చేశారు. బ్రహ్మణ సమాజంపైఅనుచిత వ్యాఖ్యాలను నిరసిస్తూ బ్రహ్మణ సేవా సంఘం, సంక్షేమ చేవెళ్ల శాఖ అద్వర్యంలో చేవెళ్ల పోలిస్ స్టేషన్ లో సీఐ భూపాల్ శ్రీధర్ కు పిర్యాదు చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎమ్మెల్యే మాటలు బ్రహ్మణ సమాజాన్ని కించపరిచేలా ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుదర్శనరావు, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఢిల్లీలో దోస్తీ... గల్లీలో కుస్తీ..!

ప్రస్తుతం భారత రాజకీయాల్లో 'శత్రువుకు శత్రువు మిత్రుడు' అనే సూత్రం విపక్షాల ఐక్యతకు దిక్సూచిగా మారింది. ఇండీ కూటమిలో అంతర్గత విభేదాలు ఉన్నప్పటికీ, లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం మరియు సీఈసీపై అభిశంసన తీర్మానం వంటి అంశాలు విపక్షాలను ఏకం చేయడానికి రాజకీయ అస్త్రాలుగా దొరికాయి. ఇవి కేవలం తీర్మానాలు మాత్రమే కావు, విపక్షాల ఐక్యతకు ఒక 'లిట్మస్ టెస్ట్' వంటివి. సంఖ్యాబలం లేకపోయినా ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో నెట్టగలమనే ఆత్మవిశ్వాసాన్ని ఇవి విపక్షాల్లో నింపాయి. అయితే, ఢిల్లీ స్థాయిలో కనిపిస్తున్న ఈ ఐక్యత రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి మాయమవుతోంది. బెంగాల్‌లో మమత వర్సెస్ కాంగ్రెస్-లెఫ్ట్, కేరళలో ఎల్డీఎఫ్ వర్సెస్ యూడీఎఫ్ పోరు విపక్షాల ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తోంది. సీట్ల సర్దుబాటు, ప్రాంతీయ అస్తిత్వ పోరాటాలు ఈ కూటమికి పెను సవాలుగా మారాయి. తమిళనాడు, మహారాష్ట్రలో పొత్తులు బలంగా ఉన్నప్పటికీ, పంజాబ్, కేరళ, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో విపక్షాల మధ్య 'పగటి పూట స్నేహం – రాత్రి పూట యుద్ధం' అనే చందంగా రాజకీయాలు సాగుతున్నాయి. శత్రువుకు శత్రువు మిత్రుడు అవుతారంటారు. ప్రస్తుతం దేశ రాజకీయాలు ఈ సమీకరణంతోనే నడుస్తున్నాయి. ముఖ్యంగా విపక్ష కూటమి. పైకి చూస్తే ఎవరికి వారే అన్నట్టుగా కనిపిస్తున్నా.. రాజకీయ శత్రువు కళ్ల ముందు కనిపించే సరికి.. ఏకం అవ్వాలనే కసి పెరుగుతోంది. నిజానికి, విపక్షాలకీ కలవాలనుంది. కలవడానికి బలమైన కారణాలూ ఉన్నాయ్. ఇండీ కూటమి విచ్ఛిన్నమైనా విపక్షాల్ని ఏకం చేయడానికి అస్త్రాలు వరుసగా దొరుకుతున్నాయ్. అందులో మొదటిది లోక్‌సభ స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం. అఫ్‌కోర్స్ ఆ తీర్మానం వీగిపోయింది. రెండ్రోజుల చర్చ తరువాత.. బుధవారం సాయంత్రం నాటి ఓటింగ్‌లో మూజువాణి ఓటుతో ఆ తీర్మానాన్ని తిరస్కరించింది లోక్‌సభ. నిజానికీ ఈ తీర్మానం వీగిపోతుందని విపక్షానికి కూడా తెలుసు. కాకపోతే.. అందులో ఓ రాజకీయ వ్యూహం ఉంది. ఇండీ కూటమి ఐక్యతకు అదో లిట్మస్ టెస్ట్ లాంటింది. ఈ తీర్మానం విపక్షాల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కన పెట్టి, వారిని ఒకే తాటిపైకి తెచ్చింది. ఎలా చెప్పగలరు అలా అంటే.. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు కలిసి ఉమ్మడిగా నోటీసు ఇచ్చాయి. తీర్మానంపై చర్చ జరిగినప్పుడు కూడా ఒక్కటిగానే నిలబడ్డాయి. ఓటింగ్ సమయంలో కలిసే ఉండాలని మాట్లాడుకున్నాయి. ఓవరాల్‌గా.. సీట్ల సర్దుబాటులో సమస్యలు ఉన్నప్పటికీ.. బీజేపీ వ్యతిరేక పోరాటంలో తామంతా ఒక్కటేననే సంకేతాన్ని ప్రజల్లోకి పంపాయి విపక్షాలు. అటు బెంగాల్ లో మాత్రం పశ్చిమ బెంగాల్‌లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలిగిన వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తమ ఉనికిని చాటుకోవడంతో పాటు మమతా బెనర్జీని గద్దె దించడమే పరమావధిగా ముందుకు సాగుతున్నాయి. గత ఎన్నికల్లో సున్నా స్థానాలకే పరిమితమైన ఈ కూటమి, ఈసారి క్షేత్రస్థాయిలో టీఎంసీ వ్యతిరేక ఓటును బీజేపీ వైపు మళ్లకుండా తమ వైపు తిప్పుకోవాలని చూస్తోంది. ముఖ్యంగా తృణమూల్ ప్రభుత్వంపై ఉన్న అవినీతి ఆరోపణలు, నిరుద్యోగ సమస్యలను అస్త్రాలుగా చేసుకుని మమతా కంచుకోటలను బద్దలు కొట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. మమతా బెనర్జీకి అండగా నిలిచే మైనారిటీ , గ్రామీణ ఓటు బ్యాంకును దెబ్బతీయడం ఈ కూటమి ప్రధాన ఉద్దేశం. గతంలో కాంగ్రెస్‌కు పట్టున్న మాల్దా, ముర్షిదాబాద్ వంటి జిల్లాల్లో టీఎంసీని అడ్డుకుంటే, రాష్ట్రస్థాయిలో మమతా ప్రాభవం తగ్గుతుందని వీరి అంచనా. మమతా బెనర్జీకి వ్యతిరేకంగా మాట్లాడే ప్రతి ఓటు తమకే పడాలని, తద్వారా టీఎంసీని బలహీనపరిచి మళ్లీ రాష్ట్రంలో తాము ఒక నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని లెఫ్ట్-కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఈ టాస్క్ లో భాగంగానే వీరు సంయుక్తంగా భారీ ర్యాలీలు నిర్వహిస్తూ క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపుతున్నారు. టీఎంసీకి వ్యతిరేకంగా నిరంతరం వీధుల్లో పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ , డీవైఎఫ్ఐ వంటి యువజన సంఘాలను లెఫ్ట్ కూటమి ముందు వరుసలో నిలుపుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జరిగిన కుంభకోణాలను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా మమతా బెనర్జీ క్లీన్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారు. మమతా బెనర్జీని పూర్తిగా ఓడించలేకపోయినా, ఆమెకు మ్యాజిక్ ఫిగర్ అందకుండా చేయడమే ఈ కూటమి అసలు టాస్క్. తద్వారా రాష్ట్రంలో టీఎంసీ ఏకపక్ష నిర్ణయాలకు అడ్డుకట్ట వేయవచ్చని వీరు భావిస్తున్నారు. మమతా వ్యతిరేక ఓట్లు కేవలం బీజేపీకే పడతాయనే భ్రమను తొలగించి, తటస్థ ఓటర్లను తమ వైపు తిప్పుకోవడంలో ఈ కూటమి ఎంతవరకు సఫలమవుతుందనేది బెంగాల్ భవిష్యత్తును నిర్ణయించనుంది. ఒకవేళ వీరు గణనీయమైన స్థానాలు సాధిస్తే, అది బెంగాల్ రాజకీయాల్లో మమతా శకానికి ముగింపు పలికే తొలి అడుగు అవుతుందని అనుకోవచ్చు. మరో వైపు ఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రవేశపెట్టిన తీర్మానం నోటీసులో విపక్షాలు ఏడు ప్రధాన ఆరోపణలు చేసినట్టు తెలుస్తోంది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత నిర్ణయాలు తీసుకుంటున్నారని, అనుచిత ప్రవర్తన రుజువైందని, ఎన్నికల అవకతవకలపై విచారణను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని, సామూహికంగా ఓటుహక్కును రద్దుచేశారని విపక్షాలు ఆరోపించాయి. కొన్ని పార్టీలకు అనుకూలంగా పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారని కూడా నోటీసులో పేర్కొన్నాయి. తమ ఆరోపణలకు బలంచేకూర్చే పలు సుప్రీంకోర్టు తీర్పులను సైతం నోటీసులో ప్రస్తావించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో కేంద్రంలోని అధికార పార్టీకి అనుకూలంగా సీఈసీ వ్యవహరిస్తున్నారని ఆరోపించాయి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే పద్ధతిలోనే సీఈసీని తొలగించాల్సి ఉంటుంది. ఇందుకు లోక్‌సభలో 100 మంది, రాజ్యసభలో 50 మంది సంతకాలు అవసరం. స్పీకర్ నోటీసును అంగీకరిస్తే ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ ఈ ఆరోపణలను పరిశీలిస్తుంది. ఆరోపణలు నిజమని తేలితే తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు. ఉభయసభల్లోనూ హాజరైన ఎంపీల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ లభిస్తే తీర్మానం నెగ్గుతుంది.

# టీడీపీ కార్యక్రమాలకు పుట్టా మహేష్ దూరం



**ఏలూరు,తెలంగాణ దిశ :** ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ డ్రగ్స్ కేసులో పట్టుబడటంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అత్యంత కఠినంగా స్పందించారు. పార్టీ క్రమశిక్షణ, నైతిక విలువల విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని స్పష్టం చేస్తూ, ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక సమర్పించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి ఆరోపణలు రావడం పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తుందని ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పార్టీ అధిష్టానం తక్షణమే రంగంలోకి దిగింది. ఎంపీ పుట్టా మహేష్‌ను పార్టీ కార్యక్రమాలన్నింటికీ తక్షణమే దూరం పెడుతున్నట్లు ప్రకటించింది. రాజకీయాలకు అతీతంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్న తరుణంలో, సొంత పార్టీ ఎంపీపైనే ఇలాంటి ఆరోపణలు రావడంతో అధిష్టానం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. కేసు విచారణ పూర్తయ్యే వరకు ఆయన పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనకుండా నిషేధం విధించినట్లు సమాచారం. అంతేకాకుండా, ఈ ఘటనపై వివరణ కోరుతూ పుట్టా మహేష్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పల్లా శ్రీనివాసరావును చంద్రబాబు ఆదేశించారు. నిర్దేశిత సమయంలోగా తనపై వచ్చిన ఆరోపణలపై తగిన వివరణ ఇవ్వాలని, ఒకవేళ అది సంతృప్తికరంగా లేకపోతే తదుపరి చర్యలు ఉంటాయని పార్టీ వర్గాలు హెచ్చరించాయి. సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అల్లుడు అయినప్పటికీ, పార్టీ నిబంధనల విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదని చంద్రబాబు ఈ చర్య ద్వారా సంకేతాలు పంపారు. ఎంపీ వివరణ అనంతరం పార్టీ ఇంకా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అంతా పొలిటికల్ ఫ్యామిలీ...: గ్స్ కేసులో పట్టుబడ్డ పుట్టా మహేష్ వారసత్వమే అర్హతగా రాజకీయాల్లోకి వచ్చారు. ఆయనకు ఎంపీగా టిక్కెట్ కేటాయించడంలో బలమైన రాజకీయ వారసత్వం, సీనియర్ నేతల అండదండలు కీలక పాత్ర పోషించాయి. ఆయన తండ్రి పుట్టా సుధాకర్ యాదవ్ తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతగా, టీటీడీ మాజీ ఛైర్మన్‌గా పనిచేయడం మహేష్‌కు రాజకీయ ఓనమాలు నేర్పింది. ప్రస్తుతం ఆయన మైదుకూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. మహేష్ కుమార్ కేవలం తన తండ్రి వారసుడిగానే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో దిగ్గజ నేతగా పేరొందిన యనమల రామకృష్ణుడికి అల్లుడు కావడం ఆయన రాజకీయ బలాన్ని రెట్టింపు చేసింది. యనమల వంటి వ్యూహకర్త కుటుంబంతో బంధుత్వం ఉండటం వల్ల పార్టీ అధిష్టానం వద్ద మహేష్‌కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ సమీకరణాల వల్లే యువకుడైనప్పటికీ, 2024 ఎన్నికల్లో ఏలూరు వంటి కీలకమైన పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేసే అవకాశం ఆయనకు దక్కింది. మహేష్ కుమార్ భార్య యనమల దివ్య కూడా ప్రస్తుతం తుని ఎమ్మెల్యేగా ఉన్నారు.

అదే సమయంలో తెలంగాణలోని బలమైన యాదవ సామాజిక వర్గ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబంతో ఉన్న వియ్యం కూడా మహేష్‌కు అదనపు బలాన్ని చేకూర్చింది. మహేష్ కుమార్ సోదరిని తలసాని కుమారుడు సాయికిరణ్ వివాహం చేసుకున్నారు. ఇలా రెండు రాష్ట్రాల్లోని ముగ్గురు సీనియర్ నేతల నీడలో మహేష్ రాజకీయం సాగుతోంది. ఈ భారీ రాజకీయ నేపథ్యం వల్లే ఆయనకు అనతి కాలంలోనే ఎంపీగా ఎదిగే అవకాశాలు వచ్చాయి. అయితే ఇప్పుడు డ్రగ్స్ కేసులో ఇరుక్కుని ఆయన తీవ్ర వివాదాస్పదం అయ్యారు. కొద్దిరోజులకు ఆయన కేసు నుంచి బయటపడతారేమో కానీ రాజకీయంగా మరోసారి అవకాశాలు రావడం మాత్రం కష్టమని అనుకోవచ్చు.

# గిట్టుబాటులేక.. ఫ్రీగా టమాట..

**మెదక్,తెలంగాణ దిశ :** మాట రేట్లు దారుణంగా పడిపోవడంతో.. ఓ రైతు కీలక నిర్ణయం తీసుకున్నాడు. టమాటా పంటను మార్కెట్‌కు తీసుకురా గా.. అక్కడ గిట్టుబాటు ధర లేకపోవడంతో.. అక్కడికి వచ్చిన ప్రజలకు ఉచితంగా తన టమాట పంటను మొత్తం పంచిపెట్టాడు. ఫ్రీగా టమాటలు ఇస్తున్నారనే విషయం తెలియడంతో స్థానికులు ఒక్కసారిగా ఎగబడ్డారు. పండించిన పంటకు ధర లేకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరికొందరు రైతులు టమాటలను కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. ప్రస్తుతం టమాటకు ధర లేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. భారీగా పెట్టుబడి పెట్టి టమాట పంటను పండించి.. కోసి మార్కెట్‌కు తీసుకువస్తే.. కనీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. వినియోగదారులకు మాత్రం టమాట అంత తక్కువ ధరకు దొరకడం లేదు. మధ్యలో ఉన్న దళారులే టమాటపై భారీగా లాభాలు పొందుతున్నారు. అటు రైతులు, ఇటు వినియోగదారులకు లాభాలు లేకుండా.. దళారులే కొట్టేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు.. టమాటను మార్కెట్‌కు తీసుకువచ్చి ధర లేక పారబోయడం, కనీసం మార్కెట్ ఖర్చులు కూడా రాకుండా బాధపడటం చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ రైతు.. తాను పండించిన టమాట పంటను తీసుకుని మహబూబా బాద్ జిల్లా కొత్తగూడ మార్కెట్‌కు వచ్చాడు. అయితే కిలో టమాటకు దళారులు కేవలం రూ.5 మాత్రమే చెల్లిస్తుండడంతో తీవ్ర అసహనానికి గురయ్యాడు. కొత్తగూడలో సంత కావడంతో గూడూరు మండలం భూపతిపేట గ్రామానికి చెందిన ఒక రైతు ఆటోలో టమాటాలను తీసుకొచ్చాడు. అయితే టమాట పంటను కొనుగోలు చేసేందుకు అక్కడ వ్యాపారులు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో తమ గ్రామం నుంచి అంతదూరం ఆటోలో టమాట పంటను తీసుకొచ్చిన ఆ రైతు.. మళ్లీ తిరిగి ఇంటికి తీసుకెళ్లలేక అక్కడే ఉచితంగా పంచిపెట్టాడు.



తాను తీసుకొచ్చిన ఆటోలో టమాటాలను ఓపెన్ చేసి.. అక్కడికి వచ్చిన వారికి ఫ్రీగా ఇచ్చేశాడు. దీంతో ఫ్రీగా టమాటాలు వస్తుండటంతో స్థానికులు భారీగా ఎగబడ్డారు. ప్రస్తుతం మార్కెట్‌లో టమాటలకు ధర లేకపోవడంతో టమాట పండించిన రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పెట్టిన పెట్టుబడి పక్కన పెడితే.. కనీసం వాటిని తెంచడానికి అయిన కూలీల ఖర్చు, మార్కెట్‌కు తీసుకొచ్చిన ఖర్చులు కూడా రావడం లేదని.. తమ చేతి నుంచే ఎదురు ఖర్చులు చేయాల్సి వస్తోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో టమాటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు వేడుకుంటున్నారు. మరికొందరు రైతులు టమాట పంట పండినా.. ధర లేకపోవడంతో.. వాటిని తెంపితే కూలీల ఖర్చు అవుతుందని.. వాటిని అమ్మినా ఆ ఖర్చులు కూడా రావని భావించి.. పొలాల్లోనే అలాగే వదిలేస్తున్నారు. మరికొందరు రైతులు పశువులకు మేతగా టమాటలను వేస్తున్నారు. ఇంకొందరు రైతులు.. తమ పొలాల్లోకి వచ్చి ఎవరైనా ఫ్రీగా కోసుకుని వెళ్లొచ్చని ఆఫర్లు ఇస్తున్నారు. వేలకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి టమాట పంటను సాగుచేస్తే.. పంట చేతికి వచ్చిన తర్వాత రేటు దారుణంగా పడిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. బయట కూరగాయల మార్కెట్లో మాత్రం వినియోగదారులకు కిలో టమాటా రూ.20 కి తక్కువకు దొరకకపోవడం గమనార్హం.

# తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టు..

**వరంగల్,తెలంగాణ దిశ :** వరంగల్ నగర ప్రజలకు గుడ్‌న్యూస్. త్వరలోనే మా మునూరు ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానుంది. ఎయిర్ కనెక్టివిటీ కోసం హైదరాబాద్ రావాల్సిన పని లేకుండా నగరం నుంచే రాకపోకలు సాగించొచ్చు. ఈ మేరకు ఎయిర్‌పోర్టు డీపీఆర్ సిద్ధం కాగా.. త్వరలోనే కేంద్రం ఆమోదముద్ర వేయనుంది. ఆ తర్వాత ఏడాదిలోగా ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తెలంగాణలో ప్రస్తుతం శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఒక్కటే పౌరులకు సేవలందిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎయిర్ కనెక్టివిటీ పెంచాలనే లక్ష్యంతో కొత్తగా మరో నాలుగు ఎయిర్‌పోర్టులు ప్రతిపాదించారు. వరంగల్ మామునూరు, రామగుండం, పెద్దపల్లి, కొత్తగూడెంలలో కొత్తగా ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. ఇందులో వరంగల్ మామునూరు విమానాశ్రయం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఏడాదిలోగా అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టు పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టు డీపీఆర్ సిద్ధంగా కాగా.. అది కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. కొద్ది రోజుల్లోనే డీపీఆర్‌కు ఆమోదం లభించే ఛాన్స్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆపై ఏడాదిలో పనులు పూర్తి చేసి ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తెచ్చేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రణాళికలు రెడీ చేస్తోంది. ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి పెద్ద పెద్ద విమానాలు ఈజీగా ల్యాండ్ అయ్యేలా రన్‌వేను మూడు కి.మీ.మేర పొడిగిస్తారు. ప్రయాణికుల టెర్మినల్, కార్గో సౌకర్యం, సెక్యూరిటీ వ్యవస్థలు, పార్కింగ్, అనుసంధాన మార్గాలు వంటివి ఎయిర్‌పోర్టులో నిర్మిస్తారు. ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పూర్తి




చేసింది. సుమారు 950 ఎకరాల భూమిని ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం కేటాయించారు. ఈ భూమికి అదనంగా మరో 253 ఎకరాలు సేకరించి ఎయిర్‌పోర్టు అథారిటీకి అప్పగించారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ ప్రస్తుతం చిన్న ఎయిర్‌స్ట్రిప్‌గా ఉంది. దీన్ని పూర్తిస్థాయి కమర్షియల్ ఎయిర్‌పోర్ట్‌గా మార్చడంతో వరంగల్ ప్రాంతం అభివృద్ధిలో దూసుకెళ్లనుందని నిపుణులు చెబుతున్నారు. ఎయిర్ కనెక్టివిటీ కోసం హైదరాబాద్ నగరం వెళ్లాల్సిన లేకుండా ఇక్కడి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు చేరుకోవచ్చునని అంటున్నారు.

పరిశ్రమలు, ఐటీ కంపెనీలు వరంగల్ నగరానికి క్యూ కడతాయని చెబుతున్నారు. టూరిజం పెరుగుతుందని.. రామప్ప ఆలయం, వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట వంటి ప్రదేశాలు సందర్శించే విదేశీ పర్యాటకులు పెరుగుతారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మొదట చిన్న, మధ్యస్థాయి విమానాలతో రాకపోకలు ప్రారంభిస్తారని.. ఆ తర్వాత రోజుకు 1-2 విమానాలు రాకపోకలు సాగిస్తాయని అంటున్నారు. ప్రధానం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై వంటి నగరాలకు కనెక్టివిటీ పెరుగుతుందని చెబుతున్నారు.

# ఫేజ్ 1కు 7వేల కోట్ల అంచనా..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ నదిపై తొమ్మిది వంతెనలను నిర్మిస్తుంది. ఇప్పటికే ఉన్న ఐదు వంతెనలను అప్‌గ్రేడ్ చేస్తుంది. అలాగే ప్రణాళిక ఫేజ్ 1లో భాగంగా మూడు నీటి నిలుపుదల బ్యారేజీలను నిర్మిస్తుందని మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలో పేర్కొంది. ఫ్రంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నరసింహ రెడ్డి సమర్పించిన ప్రతిపాదనలు.. ఓఆర్ఆర్ పరిమితుల్లోని నది ప్రతిపాదిత 55 కిలోమీటర్ల విస్తీర్ణంలో 21 కిలోమీటర్లను రెండు జోన్ లుగా విభజించాయి. కొన్ని నిర్మాణాలు తక్కువ ఎత్తులో ఉన్న కాజ్‌వేలు అని, వీటిని పైకి ఎత్తాల్సిన అవసరం ఉందని, దానిని కూడా ప్రాజెక్ట్ కింద తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఉస్మాన్‌సాగర్ నుండి తూర్పు వైపు ఉత్తర ఒడ్డున ఉన్న జోన్ 1బీ, కొత్త నిర్మాణాలలో ఎక్కువ భాగాన్ని కలిగి ఉంది. ఇందులో ఆరు వంతెనలు ఉన్నాయి. గండిపేట వంతెన రిజర్వాయర్ అంచున నిర్మిస్తారు. గోశాల నుండి గ్రేహౌండ్స్‌కు క్రాసింగ్ వంతెన, నర్సింగ్గి వద్ద ఓఆర్ఆర్‌పై వంతెన, జోన్ మధ్య భాగంలో బైరాగిగూడ వంతెన, రామ్‌దేవ్‌గూడ వంతెన, మూసా సమీపంలోని గాంధీ సరోవర్ వద్ద వంతెన పనులు జరుగుతున్నాయి. జోన్ 1ః లోని రెండు వంతెనలను అప్‌గ్రేడేషన్ కోసం ప్రతిపాదించారు: ఒకటి మంచిరేవుల వద్ద మరియు మరొకటి ఇబ్రహీం చెరువు వద్ద, ఇవి తక్కువ ఎత్తులో ఉన్న కాజ్‌వేలు. హిమాయత్‌సాగర్ వైపున ఉన్న దక్షిణ కారిడార్ అయిన జోన్ 1ం లో, దిగువ నార్సింగి స్ట్రెచ్ వెంబడి బుద్వేల్ వద్ద, మధ్య జోన్ వద్ద గాంధీ సరోవర్ వద్ద, ఈ కారిడార్ తూర్పు చివరన బాపు ఘాట్ సమీపంలో కొత్త వంతెనలు ప్రతిపాదించారు. జోన్ 1ఏ లోని మూడు వంతెనలు అప్‌గ్రేడేషన్ కోసం నిర్ణయించారు. ఇందులో వెస్ట్ సైడ్ ఓఆర్ఆర్ వంతెన, ఉప్పర్‌పల్లి, కిస్మత్‌పూర్ వద్ద నిర్మాణాలు ఉన్నాయి. ఈ వంతెనలు వాహన, మల్టీమోడల్, పాదచారుల రాకపోకలను తీసుకెళ్లడానికి రూపొందించారు. డీపీఆర్ కారిడార్ అంతటా వర్తించే ఒకే ప్రామాణిక డిజైన్ కంటే వివిధ క్రాసింగ్‌లకు సరిపోయే వంతెన రకాల కలయికను వివరిస్తుంది. వంతెనల నుండి వేరుగా మూడు నీటి నిలుపుదల బ్యారేజీలను కూడా ప్రతిపాదిం చారు. ఈ బ్యారేజీలు ఏడాది పొడవునా నీటిని నిలుపుకునేలా రూపొందించారు. 'ఈ నది వెంట నీరు ఎల్లప్పుడూ ఉంటుంది. ఇది పర్యాటకాన్ని మెరుగుపరుస్తుంది, ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తుంది, కార్యకలాపాలను మెరుగుపరుస్తుంది. ఈ ప్రత్యేక ప్రాంతంలోని ప్రతిదానినీ పెంచుతుంది.' అని నరసింహా రెడ్డి అన్నారు. ఈ బ్యారేజీలు వంతెన నెట్‌వర్క్ పక్కన పనిచేయడానికి ఉంచారు. ఒకటి కిస్మత్‌పూర్-బుద్వేల్ స్ట్రెచ్ వద్ద, మరొకటి జోన్ 1ఏ లోని బాపు ఘాట్ వంతెన దగ్గర ఉంటాయి. జోన్ 1బీలో ఇది మంచిరేవుల వంతెన దగ్గర ప్రతిపాదించారు.

# స్కానింగ్ సెంటర్ లలో ఆకస్మిక తనిఖీ

### జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి

**జగిత్యాల,తెలంగాణ దిశ :** జగిత్యాల లోని పలు స్కానింగ్ సెంటర్లనుమాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం1994 ప్రకారం లింగ నిర్ధార ణ చేసి ఆడ ,మగ అని చెప్పడం చట్టరీత్యా నేరమని, స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ మిషన్స్ మరియు డాక్టర్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉన్నాయా అని నిర్ధారించుకున్నారు. ఫారంఎఫ్ లు ప్రతినెల 5వ తారీఖు లోపు వారికి కేటాయించబడిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రశీ , ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలలో సబ్మిట్ చేయవలసిందిగా ఆదేశిం చారు. ఫారంఎఫ్ లు ఆన్లైన్లో, ఆఫ్లైన్లో ఒకే విధంగా ఉండాలన్నారు. లింగ నిర్ధారణ చేసేటప్పుడు పేషంట్లకు కనపడే విధంగా ఇక్కడ లింగనిర్ధారణ చేయబడదు – లింగ నిర్ధారణ చేసినచో కఠినచర్యలు తీసుకోబడతాయి అను ఫ్లెక్సీ బోర్డులు , ఫోం బోర్డులు ఏర్పాటు చేయవలెనని డాక్టర్ జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ నిబంధనలు అతిక్రమించిలింగ నిర్ధారణ చేసినచోజరిమానా విధించబ డడమే కాకుండా గర్భిణీమినహా ప్రోత్సహించినవారిపైకూడా జరిమా నా మరియు మూడు నెలల జైలు శిక్ష కూడా ఉంటుందని, వైద్యుల యొక్క రిజిస్ట్రేషన్ కూడా రద్దుపరుచబడతాయని తెలిపారు. నిబం ధనలు అతిక్రమించిన వారికి నోటీసులు జారీ చేయబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశంలు పాల్గొన్నారు.

# మరోమారు భగ్గుమన్న పసిడి ధర

### సగటున పది గ్రాములపై 1200 పెరుగుదల

న్యూఢిల్లీ:గత కొంతకాలంగా తగ్గుతూ వస్తున్న పసిడి ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో మేలిమి బంగారం ధర సగటున రూ.1200ల మేర పెరిగింది. వెండి ధర కూడా సగటున రూ.5 వేల మేర ఎగబాకింది. ధరలు దిగివచ్చినప్పుడు వందల్లో దిగుతూ..పెరిగితే వేలల్లో పెరగడం గమనార్హం. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,58,620లకు ఎగబాకింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే రూ.1200ల మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ పసిడి ధర కూడా రూ.1100ల మేర పెరిగి రూ.1,45,400కు చేరుకుంది. నగరంలో వెండి ధర రూ.4 వేల మేర పెరిగింది. కిలో వెండి ప్రస్తుతం రూ.2.8 లక్షలు పలుకుతోంది. ఇక చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,820గా ఉంది. ఢిల్లీలో రూ.1,58,770 వద్ద కొనసాగుతోంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ పసిడి ధర రూ.1,58,620గా ఉంది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర చెన్నైలో రూ.1,46,500గా, ఢిల్లీలో రూ.1,45,550గా ఉంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా నగరాల్లో రూ.1,45,400గా ఉంది. చెన్నైలో కిలో వెండి రూ.2.8 లక్షలకు చేరుకోగా ఇతర ప్రధాన నగరాల్లో రూ.2.75 లక్షల వద్ద కొనసాగుతోంది.

# ఎక్కువైతే ముప్పే!



ఎండ మండిపోతున్నది. ఇలాంటి వేడి వాతావరణంలో చల్లచల్లని పానీయాలు తాగాలనిపిస్తుంది. ముఖ్యంగా, చెరకు రసం.. అమృతంలా కనిపిస్తుంది. అందుకు తగ్గట్టు అనేక ప్రయోజనాలనూ అందిస్తుంది. అయితే, వేసవితాపం నుంచి ఉపశమనం ఇస్తుందని గ్లాసులకు గ్లాసులు తాగేయడం ఏమంత మంచిదికాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఐసీఎంఆర్ కూడా ఇదే చెబుతున్నదని అంటున్నారు. నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్ఎస్, ఇంగ్లాండ్) సూచనల ప్రకారం.. పెద్దవాళ్లు రోజుకు 30 గ్రా. కంటే ఎక్కువ చక్కెరను తీసుకోవద్దు. 7 నుంచి 10 ఏళ్ల పిల్లలు 24 గ్రా. కంటే తక్కువగా, 4 నుంచి 6 ఏళ్ల పిల్లలు 19 గ్రా. కన్నా తక్కువగా చక్కెరను తీసుకోవాలి. ఆ పరిమితి దాటితే.. ఆరోగ్యానికి హానికరం. అయితే, 100 మి.లీ చెరకు రసంలో 13 నుంచి 15 గ్రా. చక్కెర ఉంటుందని పరిశోధనల్లో తేలింది. ఈక్రమంలో రోజుకు రెండుగ్లాసుల చెరకు రసం తీసుకున్నా.. 400 – 450 మి.లీ తాగినట్లే! ఈ లెక్కన శరీరంలోకి 45 – 50 గ్రా. చక్కెర చేరుతుంది. ఇది దీర్ఘకాలంలో ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) కూడా ఇదే విషయం వెల్లడించింది.

**పరిమితి ఉంటేనే..:** చెరకు రసం ఆరోగ్యానికి అనేక రకాలుగా మేలుచేస్తుంది. అయితే, పరిమితి దాటితే.. అనారోగ్యం కలుగుతుంది. చెరకు రసంలో కార్బొహైడ్రేట్లు, ప్రొటీన్, ఐరన్, పొటాషియం, భాస్వరం, కాల్షియం, మెగ్నీషియం, యాంటి ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. ఇవి.. వేసవిలో శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తాయి. జీర్ణ సమస్యలతోపాటు మలబద్ధకాన్నీ నివారిస్తాయి. దంతాలు, ఎముకలకు బలాన్ని ఇస్తాయి. చెరకు రసం.. అధిక రక్తపోటు ప్రమాదాన్ని తగ్గించి, గుండె ఆరోగ్యానికి భరోసా ఇస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు వృద్ధాప్య ఛాయలను దూరం చేస్తుంది.

# మీరు రోజూ తాగే టీ లేదా కాఫీలకు బదులుగా ఈ డ్రింక్స్‌ను తాగండి..



చాలా మంది ఉదయం నిద్ర లేచిన వెంటనే తమ రోజును టీ లేదా కాఫీతో ప్రారంభిస్తారు. కొందరు రోజు మొత్తం టీ లేదా కాఫీలను అదే పనిగా తాగుతుంటారు కూడా. అయితే టీ, కాఫీలను మోతాదుకు మించి తాగితే ఆరోగ్యానికి చేటు చేస్తాయి. శరీరంలో కెఫీన్ స్థాయిలు పెరిగిపోతాయి. ఇది అనేక అనారోగ్యాలకు దారి తీస్తుంది. శరీరంలో కెఫీన్ పెరిగితే జీర్ణ సమస్యలు వస్తాయి. గుండె దడగా ఉంటుంది. బీపీ పెరిగిపోతుంది. రాత్రిపూట నిద్ర సరిగ్గా పట్టదు. ఇలా శరీరంలో అధికంగా ఉండే కెఫీన్ మనకు అనేక రకాలుగా హాని చేస్తుంది. అయితే టీ, కాఫీ తాగకపోతే ఎలా..? వాటిని తాగకుండా ఎలా ఉండగలం..? అని అనుకునే వారు ఇప్పుడు చెప్పబోయే పలు డ్రింక్స్‌ను తాగవచ్చు. వీటిని టీ లేదా కాఫీకి ప్రత్యామ్నాయంగా సేవించవచ్చు. వీటిల్లో ఎలాంటి హానికర సమ్మేళనాలు ఉండవు. కనుక ఈ డ్రింక్స్‌ను తాగితే ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందవచ్చు.

**గ్రీన్ టీ..:** టీ, కాఫీలకు బదులుగా గ్రీన్ టీని తాగడం అలవాటు చేసుకోండి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. మెటబాలిజంను పెంచుతాయి. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. శరీరంలోని కొవ్వు కరిగిపోతుంది. అధిక బరువు తగ్గుతారు. కమోమిల్, పెప్పర్ మింట్, మందార పువ్వులతో చేసిన హెర్బల్ టీలను సేవిస్తుండాలి. టీ లేదా కాఫీకి ప్రత్యామ్నాయంగా ఈ పానీయాలను సేవించవచ్చు. ఇవి జీర్ణ క్రియను మెరుగు పరుస్తాయి. వీటిల్లో కెఫీన్ ఉండదు. ఒత్తిడిని తగ్గిస్తాయి. శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. సీజనల్ వ్యాధుల నుంచి రక్షణను అందిస్తాయి. టీ లేదా కాఫీకి ప్రత్యామ్నాయంగా మచా టీని కూడా సేవించవచ్చు. ఇది ఆకుపచ్చ రంగులో ఉంటుంది. అంత ఆకర్షణీయంగా ఉండదు. కానీ ఈ టీని తాగితే ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు. ఈ టీలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలోని శక్తి స్థాయిలను పెంచుతాయి.

**పసుపు టీ..:** టీ లేదా కాఫీలకు బదులుగా పసుపు టీని కూడా తాగవచ్చు. కాస్త పసుపును నీటిలో వేసి మరిగించి తాగాల్సి ఉంటుంది. పసుపులో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. ఆర్థరైటిస్ నొప్పులు ఉన్నవారికి ఎంతగానో మేలు చేస్తాయి. పసుపు రోగ నిరోధక శక్తిని సైతం పెంచుతుంది. గాయాలు, పుండ్లు త్వరగా మానేలా చేస్తుంది. దాల్చిన చెక్క, యాలకులు, అల్లం వేసి తయారు చేసిన కషాయాన్ని టీ లేదా కాఫీకి బదులుగా తాగవచ్చు. ఇది జీర్ణక్రియను పెంచుతుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది.

**కొబ్బరి నీళ్లు..:** కొబ్బరి నీళ్లను కూడా టీ, కాఫీలకు మంచి ప్రత్యామ్నాయం అని చెప్పవచ్చు. మీకు టీ లేదా కాఫీ తాగాలని అనిపిస్తే కొబ్బరి నీళ్లను ఒక గ్లాస్ తాగండి చాలు, ఎంతో మేలు జరుగుతుంది. ఈ నీళ్లలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కనుక బరువు పెరుగుతామన్న భయం ఉండదు. అలాగే కొబ్బరి నీళ్లను తాగితే శరీరంలో ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. ఎండ వేడి నుంచి ఉపశమనం లభిస్తుంది. శరీరంలోని వేడి తగ్గి చల్లగా మారుతుంది. ఇక టీ, కాఫీలకు బదులుగా వెజిటబుల్ జ్యూస్‌ను కూడా తాగవచ్చు. కీరదోస, నిమ్మ, టమాటా, బీట్‌రూట్, క్యారెట్ వంటివి వేసి జ్యూస్ తయారు చేసి తాగితే మంచిది. ఈ జ్యూస్ వల్ల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి మన శరీరానికి కావల్సిన విటమిన్లు, మినరల్స్‌ను అందిస్తాయి. కనుక ఈ పానీయాలను మీరు టీ లేదా కాఫీకి బదులుగా సేవించవచ్చు. ఇవి ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.



# సులభంగా.. ఏసీ శుభ్రం!



ఏటికేడు వేసవి ఉష్ణోగ్రతలూ పెరిగిపోతున్నాయి. దాంతో, ఫ్యాన్లూ కూలర్లు పక్కన పడేసి.. ఎయిర్ కండిషనర్లు కొనాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. ఒకప్పుడు ఉన్నత వర్గాలకే పరిమితమైన ఏసీలు.. ఇప్పుడు మధ్యతరగతి ఇళ్లలోనూ కొలువుదీరుతున్నాయి. అయితే, ఏసీలను ఎక్కువశాతం మంది ఏడాదిలో మూడునాలుగు నెలలు మాత్రమే వినియోగిస్తుంటారు. వేసవి ముగియగానే.. వాటిని ఆన్ చేయడమే మర్చిపోతారు. మళ్లీ మార్చి నుంచే.. ఏసీల వాడకం మొదలుపెడతారు. ఏసీని మళ్లీ వాడాలంటే.. మొదటగా దాన్ని క్లీన్ చేయాలి. నిజానికి ఆయా సంస్థల టెక్నీషియన్లతోనే ఏసీలను సర్వీసింగ్ చేయించుకుంటే మంచిది. అదనపు ఖర్చు ఎందుకని, మీరే క్లీన్ చేసుకోవాలని అనుకుంటే.. కొన్ని విషయాలను మాత్రం తప్పకుండా ఫాలో కావాలి. విండో ఏసీ, స్లిట్ ఏసీ.. రెండిటిలోనూ 'ఫిల్టర్' అత్యంత ముఖ్యమైనది. వీటితోనే ఏసీ బాగా పనిచేస్తుంది. మంచి కూలింగ్ రావాలంటే.. ఫిల్టర్ బాగుండాల్సిందే! అయితే, ఏసీ ఫిల్టర్లను శుభ్రం చేసేటప్పుడు కొందరు చిన్నచిన్న తప్పులు చేస్తుంటారు. దాంతో ఫిల్టర్లు దెబ్బతిని, పాడైపోతాయి. వాటిని బాగు చేయించాలంటే.. చాలా ఖర్చు కూడా! కాబట్టి, ఏసీ దెబ్బతినకుండా ఉండాలంటే తగిన సూచనలు పాటించాలి. ఏసీ ఫిల్టర్లను ప్రతి రెండు వారాలకు ఒకసారి శుభ్రం చేస్తుండాలి. ఇందుకోసం వాక్యూమ్ క్లీనర్‌ను వాడటం మంచిది. దీనికి సున్నితంగా ఉండే బ్రష్‌ను అటాచ్ చేసుకొని, ఫిల్టర్‌ను క్లీన్ చేసుకుంటే ఇట్టే శుభ్రమవుతాయి. గోరువెచ్చని నీటిలో తేలికపాటి డిటర్జెంట్ లేదా డిష్ సోప్ కలిపి ఫిల్టర్‌ను శుభ్రం చేయాలి. ఆ తర్వాత శుభ్రమైన నీటితో కడిగి.. గాలికి ఆరనివ్వాలి. ఒక స్ప్రే బాటిల్‌లో వేడినీళ్లు, లిక్విడ్ సోప్ కలిపి.. ఏసీ కాయిల్స్‌ను శుభ్రం చేయడానికి వాడుకోవాలి. దీంతో కాయిల్స్ పూర్తిగా శుభ్రమవుతాయి. ఏసీ నెట్‌పై పేరుకుపోయే దుమ్మూధూళిని తొలగించడంలో బ్లోయర్ లేదా వాక్యూమ్ క్లీనర్ సమర్థంగా పనిచేస్తుంది.

**ఈ తప్పులు చేయకండి:** ఏసీలను శుభ్రం చేయడానికి వాషింగ్ డిటర్జెంట్‌ను ఉపయోగించకూడదు. ఇది ఏసీ ఫిల్టర్‌ను దెబ్బతీస్తుంది. ఏసీ ఫిల్టర్ చాలా సన్నగా, సున్నితంగా ఉంటుంది. గట్టిగా ఉండే బ్రష్‌తో వీటిని శుభ్రం చేయాలని ప్రయత్నిస్తే.. అవి పాడయ్యే ప్రమాదం ఉంటుంది. బట్టలు ఉతికే బ్రష్ కూడా.. ఏసీ ఫిల్టర్‌కు హాని కలిగిస్తుంది. ఎక్కువ దారాలు ఉండే వస్త్రాన్ని ఉపయోగించినా.. ఏసీ ఫిల్టర్ దెబ్బతింటుంది. ఫిల్టర్‌ను శుభ్రం చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. అది గోడకైనా, నేలకైనా తగిలితే.. ఏసీ ఫిల్టర్ పాడవుతుంది.

# వలయాలను వదిలించుకోండి



పెరుగుతున్న స్క్రీన్ టైమ్ వల్ల.. కళ్లు అనారోగ్యానికి గురవుతున్నాయి. ఎండలు, విటమిన్ల లోపం కూడా.. కళ్లకింద నల్లటి వలయాలకు కారణం అవుతున్నాయి. ఈ చిట్కాలు పాటిస్తే.. నల్లటి వలయాలు వదిలిపోతాయి. ఒక టీస్పూన్ నిమ్మరసానికి, కొద్దిగా కీరదోస రసం, చిటికెడు పసుపు కలిపి.. డార్క్ సర్కిల్స్‌పై అప్లయి చేయాలి. 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. అయితే, ఈ మిశ్రమం కళ్లలోకి పోకుండా చూసుకోవాలి. ఒక టీస్పూన్ శనగపిండిలో కొద్దిగా పసుపు, టమాట రసం వేసి పేస్ట్‌లా చేసుకోవాలి. దీనిని కంటి చుట్టూ అప్లయి చేసి.. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. డార్క్ సర్కిల్స్‌ను తగ్గించడంలో రోజ్ వాటర్ ముందుంటుంది. రాత్రి పడుకునే ముందు రోజ్‌వాటర్‌ను కళ్లపై అప్లయి చేసి.. సున్నితంగా మర్దనా చేయాలి. దీనివల్ల డార్క్ సర్కిల్స్ తగ్గడంతోపాటు కళ్లకు చల్లదనం లభిస్తుంది. కాటన్ బాల్స్‌ను రోజ్ వాటర్‌లో ముంచి.. కళ్లపై పెట్టుకోవాలి. 10 నిమిషాల తర్వాత తీసేయాలి. ఇలారోజూ చేస్తే మెరుగైన ఫలితాలు కనిపిస్తాయి. విటమిన్ ఇ నూనె, కొబ్బరినూనె, ఆలివ్ నూనె మూడింటినీ కలిపి రాత్రి పడుకునే ముందు.. కళ్ల చుట్టూ అప్లయి చేయాలి. వేళ్లతో సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. తెల్లారేసరికి చర్మం మరింత కాంతిమంతంగా కనిపిస్తుంది.

# ఆలస్యం.. విషం!



'ఆలస్యం అమృతం విషం!'.. అనే సూత్రం భోజనం విషయంలోనూ వర్తిస్తుందని చెబుతున్నారు ఆహార నిపుణులు. ఉరుకుల పరుగుల జీవితాలు, రాత్రి విధులు, పార్టీలు.. ఇలా పలు కారణాల వల్ల చాలామంది రాత్రి భోజనాన్ని ఆలస్యంగా ముగిస్తున్నారు. ఇలాంటి అలవాటు ఆరోగ్యానికి ఏమాత్రం మంచిదికాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాత్రి భోజనం లేటైతే.. పలు అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని చెబుతున్నారు. ఆలస్యంగా తినే ఆహారం.. త్వరగా జీర్ణమవ్వదు. దీంతో గ్యాస్, అసిడిటీ, కడుపుబ్బరం వంటి జీర్ణ సంబంధ సమస్యలు ఎదురవుతాయి. ఇక ఇలా భోజనం చేసి, అలా పడుకొంటే.. నిద్రకు ఆటంకం కలుగుతుంది. జీర్ణక్రియ కూడా నెమ్మదిస్తుంది. అర్ధరాత్రి భోజనం చేయడం కొందరికి అలవాటు. దీర్ఘకాలంలో ఈ అలవాటు గుండెకు హాని కలిగిస్తుంది. ఇక ఆహారం తీసుకోకపోవడం ఆలస్యమైతే.. జీవక్రియ మందగిస్తుంది. ఫలితంగా శరీరంలో కొవ్వు పెరగడం మొదలై.. ఊబకాయం బారినపడే ప్రమాదం ఉంటుంది. రాత్రిపూట కొవ్వులు, చక్కెరతో కూడిన ఆహారం ఎక్కువగా తీసుకుంటే.. పేగు క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేయడం హార్మోన్ల అసమతుల్యతకూ దారితీస్తుంది. మానసిక ఒత్తిడి, డయాబెటిస్, గుండె సంబంధిత సమస్యలను తెచ్చిపెడుతుంది. కాబట్టి భోజనానికి, నిద్రకు మధ్య కనీసం మూడు గంటలైనా విరామం ఉండాలి. రాత్రి భోజనం తర్వాత ఓ 15 నిమిషాలైనా నడవాలి.



# ఏ వడ్డీ మంచిది?

సంపాదన ఎంత పెరిగినా.. అప్పుల తిప్పలు మాత్రం తప్పడం లేదు. ఇంటి కోసమో.. కారు కొనడానికో.. వ్యక్తిగత అవసరాలకో రుణాలు తీసుకోవాల్సి వస్తున్నది. ఇలాంటి సందర్భాల్లో వడ్డీరేట్ల గురించి కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఎందుకంటే.. ఈ వడ్డీరేట్లే రుణగ్రహీతలపై ఆర్థిక భారం పెరిగేలా చేస్తాయి. ప్రస్తుతం బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు.. రెండు రకాల వడ్డీ రేట్లను వసూలు చేస్తున్నాయి. అవి.. ఫిక్స్‌డ్ వడ్డీరేటు, ఫ్లోటింగ్ వడ్డీరేటు. అప్పులు చేయడంలో ఆరితేరినవారికి వీటి గురించి తెలిసినా.. కొత్తవారికి కొంచెం కొత్తగానే అనిపిస్తాయి. పూర్తిగా తెలుసుకుంటేనే.. ఆ తర్వాత ఆర్థికభారం పడకుండా కాపాడతాయి.

**ఫిక్స్‌డ్ రేట్లు:** ఈ వడ్డీరేట్లు ఎప్పుడూ స్థిరంగానే ఉంటాయి. లోన్ తీసుకున్నప్పటి నుంచి.. టెన్యూర్ ముగిసేవరకు వడ్డీరేటు ఒకేరకంగా ఉంటుంది. ప్రతినెలా చెల్లించాల్సిన ఈఎంఐ కూడా అంతే ఉంటుంది. కాబట్టి, నెలకు ఎంత ఈఎంఐ కట్టాలో ముందే అవగాహన ఉంటుంది. ముఖ్యంగా.. ఎక్కువ రోజులు టెన్యూర్ లోన్ల కోసం ఈ ఫిక్స్‌డ్ వడ్డీరేట్లు బాగుంటాయి.

**ఫ్లోటింగ్ రేట్లు:** ఇవి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. ఫిక్స్‌డ్ రేట్ల కంటే తక్కువగా ఉండే ఈ ఫ్లోటింగ్ వడ్డీరేట్లు.. దీర్ఘకాలిక రుణాలకు ప్రయోజనకరంగా ఉంటాయి. సుదీర్ఘకాలంలో వడ్డీరేటు తగ్గింపుల నుంచి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. ఆర్బీఐ రెపో రేటును తగ్గించినప్పుడు, బెంచ్‌మార్క్ రేటు తగ్గినప్పుడు ఫ్లోటింగ్ రేటు కూడా తగ్గుతుంది. అంటే.. ఇంటి రుణంపై వడ్డీరేటు కూడా తగ్గుతుంది. దాంతో, నెలనెలా కట్టాల్సిన ఈఎంఐ కూడా తక్కువ అవుతుంది. అంతేకాదు, పలు బ్యాంకులు/ఆర్థిక సంస్థలు.. రుణాలను ముందస్తుగా చెల్లిస్తే పెనాల్టీని వసూలు చేస్తుంటాయి.

అదే.. ఫ్లోటింగ్: వడ్డీరేట్‌లో తీసుకున్న రుణాలకు ఈ సమస్య ఉండదు. కాబట్టి, ఎలాంటి ఇబ్బంది లేకుండానే రుణాలను ముందస్తుగా తీర్చే అవకాశం ఉంటుంది. అదే సమయంలో.. ఫ్లోటింగ్ వడ్డీరేట్లకు కొన్ని ప్రతికూలతలు కూడా ఉంటాయి. ఆర్బీఐ రెపోరేటు పెంచినప్పుడు, బెంచ్‌మార్క్ రేటు కూడా పెరుగుతుంది. అప్పుడు మీరు చెల్లించాల్సిన వడ్డీ రేటుతోపాటు ఈఎంఐ లేదా రుణ కాలవ్యవధి పెరుగుతుంది. ఇది.. తక్కువ ఆదాయ వర్గాలకు ఇబ్బందికరంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈఎంఐ డిఫాల్ట్ అయితే.. క్రెడిట్ స్కోరు తగ్గిపోతుంది. అందుకే ఫ్లోటింగ్ వడ్డీ రేటుతో లోన్ తీసుకునేటప్పుడు అన్ని విషయాలూ ముందుగానే చూసుకోవాలి... ఈ రెండిట్లో ఏ వడ్డీరేటును ఎంచుకోవాలనేది వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా అప్పులు తిరిగి చెల్లించగలిగే సామర్థ్యం, రుణగ్రహీతల ఆర్థిక స్తోమతను బట్టి నిర్ణయాలు తీసుకోవాలి. దీర్ఘకాలిక ప్రణాళికలు ఉన్నవారు, ప్రతినెలా చెల్లించే ఈఎంఐ మారకూడదని అనుకునేవారికి ఫిక్స్‌డ్ వడ్డీరేటు బాగుంటుందని నిపుణులు చెబుతున్నారు. బ్యాంకుల్లో వడ్డీరేట్లు తగ్గే అవకాశాలు ఉన్నప్పుడు, తక్కువ సమయంలోనే రుణాలు తీర్చేస్తామని అనుకునేవారు ఫ్లోటింగ్ వడ్డీరేట్లు ఎంచుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు.

# సాధనతో సాధ్యమే




చిన్నప్పుడు చదివిన కుందేలు, తాబేలు పరుగు పందెం కథ గుర్తుంది కదా! నిర్లక్ష్యం ఎంత ప్రమాదమో ఆ కథ చెబుతుంది. అలాగే పట్టుదలే గెలుపుబాట అని చూపుతుంది. ఆ తాబేలు పరుగునే ఆదర్శంగా తీసుకుంది ప్రముఖ ఆంత్రప్రెన్యూర్ వినీతా సింగ్. సోనీ టీవీలో ప్రసారమయ్యే 'షార్క్ ట్యాంక్ ఇండియా' కార్యక్రమం జడ్జిగా కూడా సేవలు అందిస్తున్నది. చిన్నప్పటి నుంచి వినీతకు నడక అంటే ఇష్టం. మారథాన్ పరుగులో నిర్దేశిత సమయంలో లక్ష్యాన్ని అందుకోవాలని ఉండేది. వేగాన్ని, దూరాన్ని పట్టించుకోకుండా తన సామర్థ్యాన్ని పెంచుకోవడం కోసం చాలా కాలంగా ప్రయత్నిస్తున్నది. మొదట్లో చాలా సమయంపాటు నడిచేదట. కొన్నాళ్లకు నడక వేగం పెంచింది. ఇంకొన్నాళ్లకు పరుగు అందుకుంది. వారం వారం దూరాన్ని పెంచుకుంటూ పరుగు తీసింది. పదిహేడేండ్లుగా పరుగు ఒక కళగా సాధన చేసింది. ఇటీవల జరిగిన ముంబయి మారథాన్‌లో 42 కిలోమీటర్ల దూరాన్ని 3 గంటల 58 నిమిషాల 21 సెకన్లలో చేరుకుని 'ఔరా!' అనిపించుకుంది. 'జీవితంలో ఏదైనా సాధించాలనే ప్రయత్నంలో వెంటనే విజయాన్ని ఆశించడం తప్పు కాదు. అయితే, దానికి తగినంత సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. పరిస్థితులు అనుకూలించకపోయినా.. నిరుత్సాహపడొద్దు.

# ఎన్నికలు.. ప్రజాస్వామ్యం...



పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల రణరంగం ప్రారంభమైంది. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దఫాల్లోనూ, మిగిలిన చోట్ల ఏప్రిల్ 9న ఒకే దఫాతో ఎన్నికలు ముగుస్తాయి. ఐదు అసెంబ్లీల పరిధిలో 824 స్థానాలకు జరగనున్న ఈ ఎన్నికల్లో ఎస్ఐఆర్ ప్రక్రియతో సుమారు కోటీ 40 లక్షల మంది ఓటర్లు అనర్హులుగా మారిపోయారు. 17.4 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల పరిశీలన (ఎస్ఐఆర్) పేరుతో అడ్డగోలుగా అర్హుల ఓట్లను తొలగిస్తూ, ప్రతిపక్షాల, ప్రజల ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ఎన్నికల ప్రక్రియపైనే అనుమానాలు రేకెత్తించి... పార్లమెంట్‌లో అభిశంసన ఎదుర్కోబోతున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలో ఎన్నికలు జరుగుతుండటం విచారకరం. ఓ వైపు మైనారిటీలు, మహిళల ఓట్లు ఎక్కువగా తొలగిస్తూ... మరో వైపు ఒక్క చట్టబద్ధమైన ఓటరు కూడా తన ఓటు హక్కు కోల్పోకుండా, ఒక్క అనర్హుడు కూడా ఓటు వేసే అవకాశం లేకుండా చూడటమే తన లక్ష్యమని సిఇసి సుద్దులు చెప్పడం విడ్డూరం. పశ్చిమ బెంగాల్‌లో సందేహాస్పద ఓటర్ల పేరుతో 60.06 లక్షల మంది ఓటు హక్కును అనిశ్చితిలో ఉంచడం చట్టబద్ధమైన, రాజ్యాంగ బద్ధమైన విధులను ఎలా నిర్వర్తించినట్లో ఇసి సమాధానం చెప్పాలి. హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన అప్పిలేట్ ట్రిబ్యునళ్లు రోజుకు లక్ష వరకూ ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాయి. ప్రజా ప్రాతినిధ్య చట్టం 23(3) ప్రకారం నామినేషన్ల గడువు ముగిశాక ఎన్నికల జాబితా మారకూడదు. ఏప్రిల్ 9 నాటికి బెంగాల్‌లో 40 లక్షల వరకూ పరిష్కారమవుతాయనుకున్నా... మిగతా 20 లక్షల మంది ఓటు హక్కు గల్లంతయ్యే ప్రమాదమే అధికం. నోటిఫికేషన్ రాగానే బెంగాల్ సిఎస్, డిజిపి, హోం శాఖ కార్యదర్శి, కొల్‌కతా సిపిలను ఇసి బదిలీ చేయడం బిజెపి ప్రయోజనాల కోసమేనని లోకం కోడైకూస్తోంది. పార్టీలన్నిటికీ సమానస్థాయిలో (లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్) పోటీ పడేలా ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల కమిషన్ ప్రధాన కర్తవ్యం.

పశ్చిమ బెంగాల్‌లో పగ్గాలు చేజిక్కించుకోవాలని, కేరళం, తమిళనాడులోనూ కాళ్లూనుకోవాలని బిజెపి కుతంత్రాలు పన్నుతోంది. సరిహద్దు రాష్ట్రం, సున్నితమైన ప్రాంతమైన అసోంలో మైనారిటీలకు తుపాకీ గురిపెట్టిన సిఎం చిత్రాన్ని ఫేస్ బుక్‌లో పోస్టు చేయడం... రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కడమే! ఓ వైపు మత విద్వేషాలు, హింసను రెచ్చగొట్టడం ద్వారా కుల, మత విభజనను తీసుకురావడం, మరోవైపు అభివృద్ధి, శంకుస్థాపనల హైడ్రామాలను అధికార సోపానాలుగా బిజెపి ఉపయోగించుకోవాలనుకుంటోంది.

పదేళ్ల పాలనలో అభివృద్ధి చెందిన దేశాల జీవన ప్రమాణాలతో పోటీ పడేలా కేరళంను తీర్చిదిద్ది, తీవ్ర పేదరికాన్ని తరిమేసి, ఎన్నో ఉద్యోగావకాశాలు కల్పించిన పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఎన్నికల సమరశంఖం పూరించింది. తొలి జాబితాలోని 81 మంది అభ్యర్థుల్లో 54 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలే ఉండటం... ప్రజానుకూల పాలనకు, ప్రజలపై ఉన్న నమ్మకానికి ప్రతీక. కేంద్రం అష్టదిగ్బంధనం చేసినా... కోవిడ్‌ను ఎదుర్కొన్న తీరు, భారీ వర్షాలతో కొట్టుకుపోయిన ముండకై -- చురల్మల బాధితుల కోసం టౌన్‌షిప్ నిర్మించడం, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధిని సమున్నతంగా ముందుకు తీసుకెళ్లిన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ విజన్‌కు జేజేలు పలుకుతున్న తీరు ప్రజా తీర్పుగా మారి స్ఫూర్తిదాయక విజయాన్ని అందిస్తుందని ఆశిద్దాం. మతోన్మాద ఎత్తుగడలకు వత్తాసు పలుకుతూ, మహిళా మంత్రిపై దాడికి పురికొల్పిన కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సమాయత్తమవుతున్నారు.

కేంద్రం నిధులను నిలిపివేసినా పోరాడిన తమి0ళనాడులో డిఎంకె నేతృత్వంలోని ప్రభుత్వం రెండోసారి అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రజాతీర్పును కోరుతోంది. కునారిల్లుతున్న అన్నాడిఎంకెతో కలిసి ఎన్నికలను ఎదుర్కొంటే పెద్దగా ఫలితం ఉండదని భావించిన బిజెపి... కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన స్టార్ హీరో విజయ్ టివికె పార్టీని ఆ కూటమిలోకి తీసుకొచ్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. తొక్కిసలాట కేసులు, సినిమా విడుదలను అడ్డుకోవడం ద్వారా ఒత్తిడి తీసుకొస్తోంది. రాజ్యాంగ విలువలను నిలిపేవిగా, అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యయుతంగా జరగాలని ఆశించడమే మన వంతు!

## ఆశావహుల వ్యూహం - ప్రతిపక్షాల లీకులు

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా సెగలు పుట్టిస్తున్న కేబినెట్ విస్తరణ వార్తలపై స్పష్టత వస్తోంది. సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ప్రచారానికి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణా మాలకు పొంతన లేదని ...చంద్రబాబు మార్క్ రాజకీయం తెలిసిన ఎవరైనా.. ఈ తరుణంలో మంత్రివర్గ మార్పులు సాధ్యం కాదని అం చనావేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం అత్య ంత క్లిష్టమైన ఆర్థిక పరిస్థితుల మధ్య రాష్ట్రాన్ని నడుపుతున్నారు. అమరా వతి నిర్మాణానికి నిధుల సమీకరణ, పోలవరం పనుల పునరుద్ధరణ వంటి భారీ లక్ష్యాలు ఆయన ముందున్నాయి. ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు కూడా పూర్తికాకముందే మంత్రివర్గంలో మార్పులు చేస్తే, అది అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు పాలనాపరమైన అయోమయానికి దారితీస్తుంది. అందుకే, ప్రస్తుతం తన ఫోకస్ అంతా మిషన్ బిల్డ్ ఏపీ పైనే తప్ప, రాజకీయ పదవుల పంపకంపై లేదని ఆయన స్పష్టమైన సంకేతాలిస్తున్నారు. సాధారణంగా చంద్రబాబు మంత్రులకు తనదైన శైలిలో రిపోర్ట్ కార్డ్స్ ఇస్తుంటారు. ప్రస్తుతం ఉన్న మంత్రులు తమ శాఖలపై పట్టు సాధించి, క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపడానికి కనీసం రెండేళ్ల సమయం ఇవ్వాలని ఆయన భావిస్తున్నారు. అప్పుడే ఎవరు సమర్థులు, ఎవరు విఫలమయ్యారనేది స్పష్టమవుతుంది. ఇప్పుడున్న మంత్రుల పనితీరును ర్యాంకింగ్‌ల ద్వారా పర్యవేక్షిస్తున్న సీఎం, ఇప్పుడే మార్పులు చేసి వారిలో నిరాశ నింపడం కంటే, వారిని మరింత ఉత్సాహపరిచి పని చేయించుకోవడమే ఉత్తమమని భావిస్తున్నా రు. మంత్రివర్గ విస్తరణ వార్తలు పుట్టడానికి రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి, పదవులు ఆశిస్తున్న సీనియర్ ఎమ్మెల్యేలు తమ పేర్లను చర్చల్లో ఉంచడం ద్వారా అధిష్టానంపై ఒత్తిడి పెంచాలని చూడటం. రెండు, కూటమిలో అంతర్గత విభేదాలు ఉన్నాయని చూపేందుకు ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా ఇటువంటి లీకులను వదిలి ఉండవచ్చు. అయితే, పవన్ కళ్యాణ్,చంద్రబాబు మధ్య ఉన్న దృఢమైన సమన్వయం దృష్ట్యా, ఇటువంటి ప్రచారాలు కూటమిపై పెద్దగా ప్రభావం చూపడం లేదని భావిస్తున్నారు. ప్రభుత్వానికి ఇప్పుడు అతిపెద్ద సవాలు సూపర్ సిక్స్ హామీల అమలు. ఉగాది నాటికి ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణ పనుల్లో వేగం పెంచడంపై సీఎం సీరియస్ డెడ్ లైన్లు విధించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, రాజకీయ సమీకరణాల కోసం పదవులు పంచుకుంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని చంద్రబాబుకు తెలుసని అంటున్నారు.



# ముఖ గుర్తింపుతో తిప్పలు తప్పవా?

**- ఇకెవైసి కారణంగా గతేడాది 42 రోజుల వ్యవధిలో 14.2 లక్షల మంది డ్రాప్**

**- విబి గ్రామ్ జిలో నూరు శాతం డిజిటల్ విధానం**

**అమరావతి,తెలంగాణ దిశ :** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం స్థానంలో నూతనంగా తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్రామీణ్ రోజ్‌గార్ అజీవికా మిషన్ (విబి గ్రామ్ జి) పథకం అమలును నూరు శాతం డిజిటలైజ్ చేయడంతో వేతనదారులపై ఈ ప్రభావం అధికంగా ఉండే పరిస్థితి నెలకొంది. నూతన పథకం ప్రకారం వేతనదారుల గుర్తింపు, హాజరు, వేతనాల చెల్లింపునకు నూరు శాతం డిజిటల్ విధానాలను తప్పనిసరి చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమవుతున్న ఈ పథకంలో వేతనదారులను గుర్తించేందుకు, హాజరు నమోదు చేసేందుకు ముఖ ఆధారిత విధానాన్ని వినియోగిస్తారు. దీనివల్ల ఏజెన్సీ ఏరియాలు, మారుమూల గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేనిచోట డిజిటల్ విధానంలో హాజరు నమోదు ఇబ్బందికరంగా మారనుంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, ఏలూరు, నంద్యాల, నెల్లూరు తదితర జిల్లాల్లో 5,67,816 గిరిజన కుటుంబాలకు సంబంధించిన 45,23,834 గిరిజన వేతనదారులు ఈ పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. పల్నాడు, ఏలూరు, ప్రకాశం, చిత్తూరు, అనంతపురం తదితర జిల్లాల్లో మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం అంతగా అందుబాటులో లేదు. ఎన్ఆర్ఇజిఎ సాఫ్ట్ వెబ్‌సైట్ లెక్కల ప్రకారం ఉపాధి హామీలో పనుల కోసం డిమాండ్ చేస్తున్న వేతనదారుల సంఖ్య గతేడాది కంటే ఈ ఏడాది పెరిగింది. గతేడాది 51.22 లక్షల కుటుంబాలకు చెందిన 85,73,344 మంది పని కోసం డిమాండ్ చేయగా, ప్రస్తుతం 51.81 లక్షల కుటుంబాల నుంచి 87,14,746 మంది డిమాండ్ చేస్తున్నారు. ఉపాధి పనులకు డిమాండ్ ఉన్నా డిజిటలైజేషన్, ఆధార్ బేస్ట్ పేమెంట్ సిస్టం (ఎబిపిఎస్) వంటి విధానాల వల్ల ఈ పథకం నుంచి లక్షలాది మంది తొలగించబడుతున్నారని వివిధ సంస్థల అధ్యయనాల్లో వెల్లడైంది. ఏడాదిలో ఉపాధికి 78 లక్షల మంది దూరం: 2022-23లో ఎబిపిఎస్ విధానం అమలులోకి వచ్చిన అనంతరం ఒక్క ఏడాదిలోనే 78 లక్షల మంది వేతనదారులు పనులకు దూరమ య్యారని ఉపాధి హామీపై అధ్యయనం చేస్తున్న లిబ్‌టెక్ సంస్థ గతేడాది నవంబరులో విడుదల చేసిన నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. గతేడాది అక్టోబరు 8 నుంచి నవంబరు 19వ తేదీ మధ్య 14.2 లక్షల మంది ఈ పథకం నుంచి బయటకు నెట్టివేయ బడ్డారని నివేదికలో వెల్లడించింది. ఇటువంటి పరిస్థితుల్లో విబి గ్రామ్ జి పథకంలో పూర్తి స్థాయిలో డిజిటల్ విధానాలతో హాజరు, వేతనదారుల గుర్తింపు ఎలా సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం ఉపాధి హామీ చట్టంలో నమోదైన 65.75 లక్షల కుటుంబాలకు చెందిన 1,13,39,084 మంది వేతనదారు ల్లో ఇప్పటి వరకూ ఇకెవైసి పూర్తి చేసుకున్నది కేవలం 86 శాతం మంది. మిగిలిన వేతనదారుల ఇకెవైసి ని మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ 15 రోజుల వ్యవధిలో ఇకెవైసి నూరు శాతం పూర్తి చేయడం సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఈ పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారు. కొత్త పథకం అమల్లోకి వస్తే డిజిటలైజేషన్ విధానాల వల్ల తలెత్తే సమస్యలపై ఇప్పటికే వారి సంఘాల నేతల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

# ఇరాన్‌పై దాడి మిత్ర దేశాలపై బెదిరింపులకు దిగిన ట్రంప్ !



ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ ప్రారంభించిన దాడులు మంగళవారం నాడు పద్దెనిమిదవ రోజులో ప్రవేశించాయి. వాటికి దీటుగా టెహ్రాన్ కూడా ప్రతి దాడులతో బెంబేలెత్తిస్తున్నది. హోర్ముజ్ జలసంధి ప్రాంతానికి వచ్చి అక్కడి నుంచి నౌకలకు రక్షణ కల్పించాలన్న ట్రంప్ కోరికను ఏ ఒక్క మిత్ర దేశం కూడా అంగీకరించలేదు. ఇది తమ యుద్ధం కాదని బయటకు చెప్పకుండానే ముఖం చాటేస్తుండటంతో ట్రంప్‌కు దిక్కుతోచక పిచ్చి ప్రేలాపనలకు దిగాడు. అమెరికా దాడులు ప్రారంభమైనప్పటి నుంచీ కొంత మంది అమెరికాకు వ్యతిరేకంగా ఇరాన్ పక్షాన చైనా, రష్యా ఎందుకు దాడుల్లో పాల్గొనటం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నకు కాలమే సమాధానం చెప్పింది. ఇరాన్‌కు వ్యతిరేకంగా తమతో కలసి దాడులకు పూనుకోవటంలేదని డోనాల్డ్ ట్రంప్ తన మిత్ర దేశాల మీద తిట్ల పురాణం ప్రారంభించాడు. చివరికి చైనా గనుక హోర్ముజ్ జలసంధికి యుద్ధ నౌకలను పంపి ఇరాన్‌ను కట్టడి చేయకపోతే ఈ నెలాఖరులో బీజింగ్ పర్యటనను వాయిదా వేసుకుంటానని చైనాను కూడా బెదిరించాడు. మాకేం తొందరలేదు, వస్తే రా, లేకపోతే లేదు నీ ఇష్టం అన్నట్లుగా చైనా ఉంది. నాటోలో ఉన్న దేశాలే కాదు, ఇరాన్ దాడులకు గురవుతున్న గల్ఫ్ దేశాలు కూడా యుద్ధంలో దిగేందుకు అంగీకరించటం లేదు. ఇరాన్‌పై దాడులు ఎప్పుడు ముగుస్తాయన్నది మరొక ప్రశ్న. ప్రారంభించిన అమెరికాకే దిక్కు తోచటం లేదు. ఇరాన్ వైపు నుంచి ఇలాంటి ప్రతిఘటన ఉంటుందని తనకెవరూ చెప్పలేదని, నెపాన్ని డోనాల్డ్ ట్రంప్ స్వయంగా సలహాదారులు, నిఘా యంత్రాంగం మీద నెట్టేందుకు పూనుకున్నాడు. అయితే అలాంటిదేం లేదు, ముందుగానే ట్రంప్‌కు హెచ్చరికలు అందాయని వార్తలు. ఒకవైపు ఇరాన్‌లో వేలాది కేంద్రాలపై దాడులు చేశామని, దాని మిలిటరీ నడ్డి విరిచామని రోజూ డోనాల్డ్ ట్రంప్ చెబుతుంటాడు. అదే నిజమైతే జరుగుతున్న క్షిపణి దాడుల సంగతేమిటన్న ప్రశ్నకు సమాధానం చెప్పేవారు లేరు. మొత్తంగా నాశనం చేశావని ఎలాగూ చెప్పావు కదా. ఇంక చేయాల్సిందేమీ లేదని గౌరవప్రదంగా యుద్ధాన్ని ముగించవచ్చు కదా అని ట్రంప్ మిత్రుడే బహిరంగంగా చెప్పిన తరువాత కూడా అలాంటి చర్యకు పూనుకోలేదు. ఎవరికైనా మదం తలకెక్కినపుడు హితవచనాలు రుచించవు. పశ్చిమాసియా యుద్ధంలో పాల్గొనే ఉద్దేశం తమకు లేదని జర్మనీ పేర్కొన్నది. హోర్ముజ్ జలసంధిలో నౌకల రక్షణకు మిలటరీని పంపాలనే కోరిక తమకు లేదని స్పష్టం చేసింది. ఆసియాలో అమెరికా అనుయాయి దేశం దక్షిణ కొరియా, అక్కడ అమెరికాకు తొమ్మిది మిలిటరీ కేంద్రాలు, వాటిలో అన్ని దళాలకు చెందిన 25 వేల మంది సైనికులు ఉన్నారు. తాము కూడా హోర్ముజ్‌కు నౌకాదళాన్ని పంపటం లేదని అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. తమ దేశంలో నిల్వ ఉంచిన ఆయుధాలను పశ్చిమాసియాకు తరలించారని, దీన్ని అవకాశంగా తీసుకొని ఉత్తర కొరియా దాడి చేస్తే తమ పరిస్థితి ఏమిటని కొద్ది రోజుల క్రితం దక్షిణ కొరియా అధ్యక్షుడు ఆందోళన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఇంధన ఉత్పత్తుల ఎగుమతులపై పరిమితులు విధించనున్నట్లు చెప్పాడు. నౌకలను పంపే అంశం పరిశీలనలో లేదని జపాన్ ప్రధాని తకాయిచి పార్లమెంటులో చెప్పారు. ఆస్ట్రేలియా కూడా అదే బాటలో ఉంది. ఐరోపా యూనియన్ విదేశాంగ మంత్రి కాజా కలాస్ మాట్లాడుతూ ఇప్పుడు జరుగుతున్న చర్యలను మార్చాలనే కోరిక ఇప్పటికైతే తమకు లేదని చెప్పాడు. బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ కూడా తమ దేశం విస్తృత యుద్ధంలోకి రాదని అన్నాడు.

ఇలావుండగా...యుద్ధ లక్ష్యాల గురించి ట్రంప్ మాట మార్చాడు. తాము ముడి చమురు కోసం ఇరాన్ మీద దాడి చేయలేదని ట్రంప్ చెప్పుకున్నాడు. హోర్ముజ్ జలసంధిలో నౌకలు స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా తమ మిత్ర దేశాల కోసమే దాడి చేసినట్లు మాట మార్చాడు. అందుకుగాను ఆ ప్రాంతంలో రక్షణ కోసం చైనా, జపాన్ వంటి దేశాలు యుద్ధ నౌకలను పంపాలని అన్నాడు. తమకు చమురు అవసరం లేదని, కావాల్సిన దానికంటే రెండింతల ఎక్కువ ఉందని, మా మంచి మిత్రుల కోసమే దాడి చేశామని అన్నాడు. నిజానికి ఇతర దేశాలను రక్షించాలని తప్ప మా కోసం దాడులు చేయటం లేదన్నాడు. తమ మిత్ర దేశాలు ముఖ్యంగా నాటో దేశాల వైఖరి ఆశాభంగం కలిగించిందని ట్రంప్ చెప్పాడు. మేం మాత్రం వారికోసం ఎల్లవేళలా ఉండాలి, కాని వారు మాత్రం మాకోసం రారు అంటూ బి-2 స్పిరిట్ బాంబరు బొమ్మను చూపుతూ హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు మాకు ఎవరి అవసరమూ లేదని ఊగిపోయాడు. తమకు సహకరించకపోతే నాటోకు రానున్నది చెడు కాలమన్నాడు. ఇరాన్‌పై దాడులను ప్రారంభించినప్పటి నుంచి గల్ఫ్, ఇతర దేశాలను యుద్ధంలోకి లాగాలని అమెరికా తీవ్రంగా చేస్తున్న ప్రయత్నాలకు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. ఇరాన్ వైపు నుంచి క్షిపణుల వర్షం కురుస్తున్నప్పటికీ ప్రత్యక్షంగా దాడులకు గల్ఫ్ దేశాలు పూనుకోలేదు. అమెరికాను నమ్మి నిజంగా తమ దళాలను రంగంలోకి దింపితే తలెత్తే పర్యవసానాల గురించి పైకి చెప్పుకోవటం లేదుగానీ అవి తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. పొద్దున లేస్తే ఇరాన్‌తో ముఖాముఖాలు చూసుకోవాల్సింది తామని...ఈ రోజు అమెరికా ఉంటుంది, రేపు వెళ్లిపోతుంది. తాము శాశ్వతంగా బలమైన ఇరాన్‌తో వ్యవహరించాల్సి ఉంటుందని చెబుతున్నారు. తప్పనిసరై అమెరికా స్థావరాలు ఉన్న కారణంగా కొన్ని ఆయుధాలను గల్ఫ్ దేశాల మీద ప్రయోగించాల్సి వస్తోంది తప్ప తమ కేంద్రీకరణ అంతా ఇజ్రాయిల్ మీదనే అని తాజాగా ఇరాన్ ప్రకటించింది. అమెరికా యుద్ధ స్థావరాలున్న గల్ఫ్ దేశాల మీద దాడి చేస్తే అవి అమెరికాకు వ్యతిరేకంగా వ్యహరించాలనే ఎత్తుగడ ఉందని బహిరంగంగానే చెబుతున్నారు. తాజా పరిణామాల్లో మరో ముఖ్యాంశం ఏమంటే ఇరాన్‌పై అమెరికా దాడి రష్యాకు పెట్రో డాలర్లను కురిపిస్తోంది. ట్రంప్ అనుకున్నదొకటి అవుతున్నది ఒకటి. మాస్కో నుంచి చమురు కొనుగోలు చేయవద్దని ఆంక్షలు విధించిన అమెరికా ఇప్పుడు కొనుగోలు చేయవచ్చని అన్ని దేశాలకు అవకాశం ఇస్తున్నట్లు ప్రకటించింది. నరేంద్రమోడీ సైతం ఈ పరిణామాన్ని ఊహించలేదు. ఏ మాత్రం పసిగట్టినా ట్రంప్ బెదిరించగానే రష్యా నుంచి చమురు కొనుగోలును సగానికి సగం తగ్గించి ఉండేవారు కాదు. ఇప్పుడు పరువూ పోయింది. రష్యా నుంచి వచ్చే రాయితీ కూడా లేదని చెబుతున్నారు. చమురుపై ఆంక్షలతో రష్యా ఆర్థిక మూలాలను దెబ్బ తీస్తామని బహిరంగంగానే ప్రకటించారు. అయినప్పటికీ నాలుగేళ్లుగా కొంత ఇబ్బంది పడినప్పటికీ భారత్ చైనా కొనుగోళ్లతో నిలిచింది. ఇటీవల ట్రంప్ బెదిరించటంతో మన దేశం సగానికి కొనుగోళ్లను తగ్గించింది. హోర్ముజ్ జలసంధి దిగ్బంధనంతో అనేక దేశాల నుంచి ఒత్తిడి పెరగటంతో రష్యా చమురు కొనుగోలుకు అమెరికా "అనుమతి" ఇచ్చింది. దీంతో ప్రస్తుతం రోజుకు 15 కోట్ల డాలర్ల మేర పుతిన్ సర్కార్‌కు రాబడి వస్తోంది. పన్నెండు రోజుల తరువాత బ్రిక్స్ కూటమి అధ్యక్ష స్థానం (భారత్)...ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులు అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఖండించింది. ఇదే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ ఇరాన్ నేతలతో మాట్లాడారు. ఆ తరువాతే మన దేశానికి ఎల్‌పిజి ని తీసుకువచ్చే మూడు ట్యాంకర్లను సురక్షితంగా హోర్ముజ్ జలసంధి నుంచి ఇరాన్ అనుమతించింది. మన దేశంపై వచ్చిన ఒత్తిడి, వంట గ్యాస్ సెగ తగిలిన తరువాతగాని మన నేతలకు తత్వం తలకెక్కలేదని చెప్పవచ్చు!

# సువేంద్ర అక్కడి నుంచే పోటీ..

కోల్ కత్తా, :కోల్ కత్తా సెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ నుంచి బరిలో నిలిచిన పశ్చిమ్ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ.. తన మాజీ అనుచరుడు, బీజేపీ నేత సువేందు అధికారి చేతిలో ఓటమి పాలయ్యారు. ఈసారి కూడా దీదీని సువేందు ఢీకొట్టబోతున్నారు. బెంగాల్ ఎన్నికలకు 144 మంది అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ సోమవారం విడుదల చేయగా... ప్రస్తుతం మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న భవానీపూర్ నుంచి తమ అభ్యర్థిగా ప్రతిపక్ష నేత సువేందును ప్రకటించింది. నందిగ్రామ్ నుంచి కూడా సువేంద్ పోటీ చేయనున్నారు. అయితే, దీదీ ఎక్కడ నుంచి పోటీ చేస్తారనేది ఇంకా స్పష్టత లేదు. కానీ, భవానీపూర్ నుంచే మళ్లీ బరిలోకి దిగుతారనే ప్రచారం జరుగుతోంది. వరుసగా ఇదే నియోజకవర్గానికి మమతా మూడుసార్లు విజయం సాధించారు. పశ్చిమ్ బెంగాల్‌లో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. కమ్యూనిస్టుల కంచుకోటను బద్దలుకొట్టి 2011లో మమతా బెనర్జీ అధికారంలోకి రావడంలో 'నందిగ్రామ్' కీలక పాత్ర పోషించింది. నాటి కమ్యూనిస్ట్ ప్రభుత్వ చేపట్టిన భూసేకరణకు వ్యతిరేకంగా మమతా నాయకత్వంలో టీఎంసీ చేపట్టిన ఉద్యమంలో సువేందు అధికారి ఆమెకు తోడుగా ఉన్నారు. తర్వాత అక్కడ నుంచే అసెంబ్లీకి ఎన్నికయ్యారు. కానీ 2021లో మమతా బెనర్జీపై ఆయననే బీజేపీ ఆయుధంగా ప్రయోగించింది. పోరాటంలో ఎప్పుడూ వెనక్కి తగ్గని దీదీ.. నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగారు.

ఎంతో ప్రతిష్మాత్మకంగా తీసుకున్న ఈ సీటులో 1956 ఓట్ల తేడాతో సువేందు గెలిచి, పైచేయి సాధించారు. నందిగ్రామ్ అధికారికి అండగా నిలుస్తోందన్న విషయం.. ఆ మరుసటి ఏడాది జరిగిన సహకార సంస్థ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో స్పష్టమైంది.అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా తృణమూల్ కాంగ్రెస్ గెలిచి హ్యాట్రిక్ కొట్టినా.. నందిగ్రామ్‌లో దీదీన ఓటమి ఎదుర్కొన్నారు. దీంతో తన సొంత నియోజకవర్గం భవానీపూర్ నుంచి మళ్లీ పోటీచేసి 50 వేలకుపైగా ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.

గత ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి పేరుకు ముందు 'మాజీ' అనే పదాన్ని చేర్చాలని తాను కోరుకుంటున్నట్లు ప్రకటించిన అధికారి.. ఈసారి కూడా తాను పోటీచేయబోయే సీటు ఎంపిక ద్వారా ఒక స్పష్టమైన సందేశాన్ని పంపారు. '

'నందిగ్రామ్‌లో నేను ఆమెను ఓడించాను.. ఈసారి భవానీపూర్‌లో కూడా ఆమెను ఓడిస్తాను... 50,000 ఓట్ల తేడాతో ఆమెను మాజీ ముఖ్యమంత్రిగా మారుస్తాను" అని అధికారి పలు సందర్భాల్లో శపథం చేశారు.కాగా, ఇటీవల బెంగాల్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భారీగా ఓటర్లను తొలగించారు.

దీదీ కంచుకోట అయిన భవానీపూర్.. రాష్ట్రంలో అత్యధికంగా ఓటర్లను తొలగించిన నియోజవర్గాల్లో ఒకటి. ఈసీ గతవారం విడుదల చేసిన డేటా ప్రకారం నందిగ్రామ్ కంటే నాలుగు రెట్లు ఇక్కడ ఓట్లు తొలగించారు. భవానీపూర్‌లో మొత్తం 2,06,295 ఓట్లు ఉండగా 44,787 ఓట్లు... నందిగ్రామ్‌లో 2,78,211 ఓట్లు ఉండగా 10,599 ఓట్లను తొలగించారు. బెంగాల్ అసెంబ్లీకి రెండు దశల్లో ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న పోలింగ్ జరగనుంది. మే 4న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడిస్తారు.

## మహమ్మదాబాద్‌లో గ్రామపంచాయతీ భవనం ప్రారంభం..



**మహమ్మదాబాద్,తెలంగాణ దిశ :** పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి మహమ్మదాబాద్ మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మండల కేంద్రంలోని నూతన గ్రామపంచాయతీ భవనాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఈ భవనం కీలకంగా ఉంటుందని తెలిపారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి పథకం ఒక వరమని, ఇది వారి కుటుంబాల పై ఉన్న ఆర్థిక భారం తగ్గిస్తుందని పేర్కొన్నారు. అయితే సాయంత్రం 5 గంటలకు రావాల్సిన ఎమ్మెల్యే ఆలస్యంగా రావడం వల్ల కార్యక్రమానికి చేరుకోవడంతో మధ్యాహ్నం నుంచే వచ్చిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెక్కుల పంపిణీ సమయంలో వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో చరవాణి వెలుతురులోనే చెక్కులు అందజేశారు. తదుపరి మహమ్మదాబాద్ మండలం ధర్మపూర్ గ్రామపంచాయతీలో రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే సంగాయపల్లి గ్రామపంచాయతీలో రూ. 5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంగాయపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం అటవీశాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటి పర్యావ రణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఎం నారాయణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కమతం విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జే.రామ్ లాల్, మాజీ ఎంపీపీ శాంతి రంగ్యా, మండల తహసీల్దార్ విద్యాసాగర్ రెడ్డి, ఎంపీడీవో నరేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ పవన్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అటవీశాఖ అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన వర్సెస్ టీడీపీ




**కాకినాడ,తెలంగాణ దిశ :** పిఠాపురం నియోజకవర్గ శాశ్వత ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్ ఉంటారని, ఆయన చేస్తున్న అభివృద్ధే అందుకు నిదర్శనమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పిఠాపురంలో ఇప్పటికే 60,000 మందితో జనసేన ఒక బలమైన కుటుంబంగా మారిందని, త్వరలోనే లక్ష సభ్యత్వాల మార్కును చేరుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ కేవలం రాష్ట్ర స్థాయి నేత మాత్రమే కాదు, దేశ స్థాయి నాయకుడిగా ఎదిగారని కొనియాడారు. డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి బాబు కూడా పవన్ కళ్యాణ్ సేవలను కొనియాడుతూ, ఎంపీ వ్యాఖ్యలకు మద్దతు తెలిపారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఠాపురంలో పార్టీ శ్రేణులు పండుగ వాతావరణాన్ని తలపించేలా వేడుకలు నిర్వహించాయి. ఉప్పాడ బస్టాండ్ వద్ద భారీ కేక్ కట్ చేసిన అనంతరం, పిఠాపురం నుండి గొల్లప్రోలు వరకు జనసైనికులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గొల్లప్రోలులో అట్టహాసంగా జెండా ఆవిష్కరణ జరిగింది. రాజకీయ వేడుకలతో పాటు సేవా నిరతిని చాటుకుంటూ, పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు ఓదూరి కిషోర్ సహా భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. అయితే, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వ్యాఖ్యల వెనుక పిఠాపురం నియోజకవర్గంలో సాగుతున్న అంతర్గత రాజకీయ పోరు కారణమనే చర్చ నడుస్తోంది. ఇటీవల ఒక ప్రభుత్వ కార్యక్రమంలో ఫ్లెక్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో చిన్నదిగా ఉండటంపై టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ అధికారులపై, జనసేన నేతలపై మండిపడ్డారు. ముఖ్యమంత్రికి ప్రాధాన్యత లేని చోట టీడీపీ కార్యకర్తలకు స్థానం ఎక్కడిదని ఆయన ప్రశ్నిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కూటమి నాయకులు రాష్ట్ర స్థాయిలో కలిసి ఉన్నప్పటికీ, పిఠాపురంలో మాత్రం టీడీపీ, జనసేన నేతల మధ్య 'కోల్డ్ వార్' నడుస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. వర్మ అసహనానికి కౌంటర్ గానే ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ "శాశ్వత ఎమ్మెల్యే" వ్యాఖ్యలు చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పిఠాపురంలో శుక్రవారం జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం చెలరేగింది. మున్సిపల్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో చాలా చిన్నదిగా ఉండటంపై మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్రంగా మండిపడ్డారు. అధికారులే కూటమి పార్టీల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. ఇది కేవలం తనను మాత్రమే కాకుండా, మూడు పార్టీల నాయకులను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. పిలిచి అవమానించడం తగదని సూచిస్తూ, అధికారుల తీరుకు నిరసనగా ఆయన సమావేశం మధ్యలోనే వెళ్ళిపోయారు. వర్మకు మద్దతుగా టీడీపీ కార్యకర్తలు కూడా అధికారుల వ్యవహారశైలిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పిఠాపురంలో వర్మ బలమైన నాయకుడు. గతంలో ఓసారి పార్టీ టికెట్ రాకపోతే ఆయన ఇండిపెండెంట్గా పోటీ చేసి గెలిచారు. పిఠాపురం నియోజకవర్గాన్ని బలమైన నియోజకవర్గంగా మార్చారు వర్మ. అయితే రాష్ట్ర స్థాయిలో పవన్ కళ్యాణ్ తో టిడిపికి పొత్తు అవసరం. గత అనుభవాల దృష్ట్యా పవన్ కళ్యాణ్ కు ఒక నియోజకవర్గం అవసరం వచ్చింది. అంతకుముందు ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోవడంతో 2024లో జాగ్రత్త పడ్డారు. అలా పిఠాపురం పై దృష్టి పడడంతో వర్మను సైడ్ చేయాల్సి వచ్చింది. బలమైన నాయకుడు కావడంతో ఆయన సాయం తీసుకోవాలని భావించి ప్రాధాన్యమిచ్చారు వర్మకు.. అయితే బలమైన హామీతోనే అప్పట్లో వర్మ పోటీ నుంచి తప్పుకున్నట్లు ప్రచారం ఉంది. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీంతో రోజురోజుకు వర్మలో అసహనం పెరుగుతోంది. టిడిపి నాయకత్వం సైతం వర్మ విషయంలో నిస్సహాయతతో ఉంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పిఠాపురం నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. వర్మ కు ఎటువంటి నామినేటెడ్ పదవి దక్కలేదు. ఆపై పిఠాపురం నియోజకవర్గంలో అధికార పార్టీగా సరైన గౌరవం దక్కడం లేదు. ఈ తరుణంలో పిఠాపురంలో జనసేన వర్సెస్ టిడిపి అన్నట్టు పరిస్థితి మారింది. రాష్ట్రస్థాయిలో పొత్తు ఉండడం.. పవన్ కీలకంగా ఉండడం.. ఆయనకు కాదని వర్మకు పదవి ఇచ్చే అవకాశం లేకపోవడంతో రోజురోజుకు పరిస్థితి శృతిమించుతోంది. అయితే పిఠాపురంలో తనకే కాదు చంద్రబాబుకు కూడా విలువ లేదని చెప్పేందుకే వర్మ అలా చేసి ఉంటారన్న టాక్ కూడా పొలిటికల్ వర్గాల్లో ఉంది. ఇప్పటికే పిఠాపురం అనేసరికి రకరకాల వివాదం నడుస్తూనే ఉంటుంది.

ఒకానొక దశలో వర్మ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోతారని కూడా ప్రచారం నడిచింది. పార్టీ కోసం కష్టపడిన తాను ఎందుకు గుడ్ బై చెబుతానని వర్మ ప్రశ్నించారు కూడా. అయితే తన ఆవేదనంత పార్టీ కోసమే అన్నట్టు ఇప్పుడు వర్మ ప్రవర్తన ఉంది. దీనిపై టిడిపి నాయకత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

# 5 రాష్ట్రాల్లో గెలుపు ఎవరిది



దేశంలో ఎన్నికల సందడి మొదలైంది. కీలకమైన నాలుగు రాష్ట్రాలు మరియు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ ఐదు ప్రాంతాల్లో కలిపి మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చేసింది. ఈ ఐదురాష్ట్రాల ఎన్నికల్లో అస్సాంలో మాత్రమే కాంగ్రెస్, బీజేపీ ముఖాముఖి పోటీ పడుతున్నాయి. బెంగాల్ లో బీజేపీ టీఎంసీ, కేరళలో కాంగ్రెస్ , లెఫ్ట్ కూటములు.. తమిళనాడులో త్రిముఖ పోటీ ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం , పుదుచ్చేరిలలో రాజకీయ సందడి పతాక స్థాయికి చేరింది. ఈ ఎన్నికలు కేవలం స్థానిక ప్రభుత్వాల మార్పుకే పరిమితం కాకుండా, కేంద్ర రాజకీయాల్లోనూ మార్పులు తీసుకురానున్నాయి. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం ఉన్న రాష్ట్రాల్లో జాతీయ పార్టీలు ఏ మేరకు పాగా వేస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పశ్చిమ బెంగాల్ పోరు మళ్ళీ దీదీ వర్సెస్ మోదీ గా మారింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ తన పదేళ్ల సంక్షేమ పథకాలు ,బెంగాలీ అస్మితను నమ్ముకోగా, బీజేపీ అవినీతి , ప్రజల అసంతృప్తిని ప్రధాన అస్త్రాలుగా చేసుకుని బరిలోకి దిగుతోంది. గత ఎన్నికల కంటే ఈసారి బీజేపీ మరింత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండటంతో, బెంగాల్ గడ్డపై హోరాహోరీ పోరు తప్పేలా లేదు. ఇక్కడ చిన్నపాటి ఓట్ల చీలిక కూడా ఫలితాలను తలకిందులు చేసే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. అధికార డీఎంకే కూటమి పటిష్టంగా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, సూపర్ స్టార్ విజయ్ రాజకీయ ప్రవేశం తమిళగ వెట్రి కజగం రూపంలో కొత్త సవాలును విసిరింది. అన్నాడీఎంకే తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ఉండగా, విజయ్ రాకతో ఇక్కడ ముక్కోణపు పోటీ నెలకొంది. విజయ్ వైపు మళ్లుతున్న యువత ఓట్లు ఎవరి గెలుపును అడ్డుకుంటాయో అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. పుదుచ్చేరిలో కూడా ఇదే విధమైన కూటముల పోరు సాగుతోంది. డీఎంకే కూటమిలో కాంగ్రెస్, అన్నాడీఎంకే కూటమిలో బీజేపీ ఉన్నాయి. సాధారణంగా కేరళలో ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారుతుంటుంది, కానీ గత ఎన్నికల్లో పినరయి విజయన్ ఆ సంప్రదాయాన్ని చెరిపివేశారు. ఎల్.డి.ఎఫ్ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించాలని చూస్తోంది. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ఈసారి ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని పట్టుదలతో ఉంది. బిజెపి ఇక్కడ బలమైన మూడో శక్తిగా ఎదగడానికి ప్రయత్నిస్తోంది. త్రిముఖ పోటీ జరిగే కొన్ని నియోజకవర్గాల్లో బిజెపి ఓట్లు ఎవరిని ముంచుతాయో అన్నది కీలకం. అస్సాంలో ప్రధాన పోటీ బిజెపి , కాంగ్రెస్ మధ్యే ఉంది. ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ సారథ్యంలో బిజెపి ధీమాగా ఉంది. మహాజోత్ కూటమి విచ్ఛిన్నం కావడం బిజెపికి కలిసి వచ్చే అంశం. కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ గొగోయ్ తన వ్యక్తిగత చరిష్మాతో బిజెపికి గట్టి పోటీ ఇస్తున్నారు. అయితే, అభివృద్ధి మంత్రం , హిందూత్వ కార్డుతో బిజెపి పైచేయి సాధించే అవకాశాలు ఉన్నాయని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ స్థానిక సమస్యలతో పాటు జాతీయ అంశాలు కూడా ఓటర్లపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు అటు అధికార పక్షానికి, ఇటు విపక్ష కూటమికి అత్యంత ప్రతిష్టాత్మకం కానున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల తీర్పు భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడులలో ప్రాంతీయ పార్టీల పట్టు నిలుస్తుందా? లేదా జాతీయ పార్టీలు తమ ప్రభావం చూపిస్తాయా? అన్నది మే నెలలో తేలనుంది. తమిళనాడు, బెంగాల్, కేరళ, అస్సాం , పుదుచ్చేరి శాసనసభల పదవీకాలం మే, జూన్ నెలల్లో ముగియనుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఈసీ ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేసింది. క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఆరు రాష్ట్రాల్లోని ఎనిమిది స్థానాలకు ఉప ఎన్నికలు కూడా జరగనున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేల మరణంతో అనివార్యమైన ఈ ఉప ఎన్నికల వివరాలు:పశ్చిమ బెంగాల్‌లో వరుసగా అధికారంలో ఉన్న మమతా బెనర్జీకి ఈసారి వ్యతిరేక పవనాలు బలంగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. బీజేపీ బలమైన ప్రతిపక్షంగా అవతరించడం, క్షేత్రస్థాయిలో సంస్థాగత మార్పులు మమతా బెనర్జీకి పెద్ద సవాలుగా మారాయి. అవినీతి ఆరోపణలు, నిరుద్యోగ సమస్యలు మరియు శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వంపై వస్తున్న విమర్శలు దీదీకి మైనస్ పాయింట్లుగా మారుతున్నాయి. ప్రజలు మార్పును కోరుకుంటున్నారా? లేక సంక్షేమ పథకాలతో మమత మరోసారి అధికారాన్ని నిలబెట్టుకుంటారా? అన్నది వేచి చూడాలి. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వంపై ప్రజల స్పందన మిశ్రమంగా కనిపిస్తోంది. ధరల పెరుగుదల, మౌలిక సదుపాయాల కొరత, మరియు కొన్ని ప్రజా వ్యతిరేక విధానాలు స్టాలిన్ సర్కార్‌కు ఇబ్బందిగా మారాయి. తమిళనాడు రాజకీయాల్లో వస్తున్న కొత్త మార్పులు, మిత్రపక్షాల ఒత్తిడి మరియు బీజేపీ వంటి జాతీయ పార్టీల విస్తరణ స్టాలిన్ ఓటు బ్యాంకుకు ఎంతవరకు గండి కొడుతుందనేది కీలకం. సంక్షేమ కార్యక్రమాలపై పెడుతున్న భారీ వ్యయం మరియు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అధికార పక్షాన్ని ఆత్మరక్షణలో పడేశాయి. ఈ ఇద్దరు దిగ్గజ నాయకులు తమ పట్టును నిలబెట్టుకుంటారా లేక ఓటమిని మూటగట్టుకుంటారా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏది ఏమైనా, ఓటర్ల నాడి వేరుగా ఉంటుంది. సంక్షేమ పథకాలపై నమ్మకమా? లేక పరిపాలనలో మార్పు కోరుకుంటున్నారా? అన్నది మే 4న వెల్లడి కానుంది.

## ఐసిస్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు

### మొరాదాబాద్‌లో డెంటల్ విద్యార్థి అరెస్ట్

లక్నో, : యుపిలో టెర్రరిస్ట్ సంబంధాలు ఉన్నవారిపై దాడులు కొనసాగుతున్నాయి. నిషేధిత ఉగ్రవాద సంస్థ ఐసిస్‌తో ఆన్‌లైన్‌లో సంబంధాలున్నాయనే ఆరోపణలతో 19 ఏళ్ల వైద్య విద్యార్థిని యుపి పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భారత్‌లో పనిచేస్తున్న ఐసిస్ అనుబంధ ఆన్‌లైన్ నెట్‌వర్క్ కార్యకలాపాలపై కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, షహరాన్‌పూర్ జిల్లాకు చెందిన హారీష్ అలీని ఆదివారం మొరదాబాద్‌లో అరెస్ట్ చేసినట్లు ఎటిఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. బిడిఎస్ (డెంటిస్ట్) రెండో సంవత్సరం చదువుతున్న హారీష్ అలీ, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్‌లు మరియు సెషన్, డిస్కార్ట్ వంటి ఎన్‌క్రిప్టెడ్ అప్లికేషన్‌ల ద్వారా ఐసిస్ సభ్యులు, సానుభూతిపరులతో సంబంధాలు కలిగి ఉన్నాడని అధికారులు పేర్కొన్నారు. ఐసిస్ భావజాలాన్ని ప్రచారం చేయడానికి, దేశంలో ఉగ్రవాద సంస్థను బలోపేతం చేయడానికి వ్యక్తులను నియమించడం లక్ష్యంగా ఆన్‌లైన్ గ్రూపులను సృష్టిస్తున్నారని ఎటిఎస్ తెలిపింది. నిందితులు అల్ ఇత్తిహాద్ మీడియా ఫౌండేషన్ అనే పేరుతో ఒక ప్రత్యేక గ్రూపును కూడా నడిపారని, భారత్‌తో పాటు విదేశాల్లో ఐసిస్ నెట్‌వర్క్‌లోని వ్యక్తులతో సంబంధాలు కొనసాగించారని అధికారులు తెలిపారు. లక్నోలోని ఎటిస్ పోలీస్ స్టేషన్‌లో యుఎపిఎ మరియు బిఎన్‌ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎటిఎస్ పేర్కొంది.

## ఇటానగర్‌లో విరిగిపడ్డ కొండచరియలు

### గోడకూలి నలుగురు మృత్యువాత

**ఇటానగర్,తెలంగాణ దిశ :** కొండచరియలు విరిగిపడడంతో గోడ కూలి నలుగురు మృతి చెందారు. ముగ్గురికి గాయాలయ్యాయని ఇటానగర్ అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. సోమవారం సాయంత్రం ఇటానగర్‌లో నీతి బీహార్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. మృతి చెందిన వారిని చోకి తసర్, రతన్ బర్మాన్, గోడక్ రాజా, గోడక్ టాబిన్‌లుగా అధికారులు గుర్తించారు. నిర్మాణ పనుల్లో భాగంగా కొంతమంది కార్మికులు అక్కడ పనిచేస్తున్నారు. ఈ సమయంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం, జిల్లా యంత్రాంగం అక్కడికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. రెస్క్యూ బృందం ఘటనా స్థలం నుంచి నాలుగు మృతేహాలను వెలికితీశారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు అని ఇటానగర్ ఎస్‌పి జుమార్ బసర్ మీడియాకు వెల్లడించారు.

## కూకట్‌పల్లి కోటి రూపాయల దోపిడీ ఘటన

### కళ్లల్లో కారం చల్లి దోచుకున్న దుండగులు

### వివరాల ఆధారంగా రంగంలోకి పోలీసులు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలో భారీ దోపిడీ కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దుండగులను పట్టుకునేందుకు బృందాలు రంగంలోకి దిగాయి. సోమవారం రాత్రి సుమారు 9:40 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో స్కూటీపై డబ్బులు తరలిస్తున్న ఇద్దరిపై దుండగులు దాడి చేసి కోటి రూపాయల నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన కూకట్‌పల్లి పిలర్ నెంబర్ 825 సమీపంలో, ఏసీపీ కార్యాలయం పక్కనే జరగడం మరింత సంచలనంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం మహ్మద్ ఖుస్రూ (42), మహ్మద్ అజీముద్దీన్ (38) అనే ఇద్దరు వ్యక్తులు స్కూటీపై కోటి రూపాయల నగదును తరలిస్తున్నారు. వీరు బహదూర్‌పురాకు చెందిన ఏసీ మెకానిక్స్. అనుమానం రాకుండా ఉండేందుకు గోల్డ్ డ్రాప్ కార్టన్ బాక్స్‌లో కోటి రూపాయలను పెట్టుకుని బైక్‌పై తరలించే ప్రయత్నం చేశారు. కూకట్‌పల్లి పిల్లర్ నెంబర్ 825 వద్ద ఏజెంట్లు డబ్బు కలెక్ట్ చేసుకున్నారు. అయితే వీరిని ముందుగానే గమనించిన దుండగులు మూడు బైక్‌లపై ఫాలో అయ్యారు. డబ్బు కలెక్ట్ చేసుకుని కేవలం 100 మీటర్ల దూరం ప్రయాణించగానే.. నలుగురు దుండగులు స్కూటీపై వెళ్తున్న వారిపై కారం పొడి చల్లి దాడి చేశారు. దీంతో బాధితులు కింద పడిపోగా.. వెంటనే నగదు ఉన్న బాక్స్‌ను తీసుకుని దుండగులు పరారయ్యారు. ఈ ఘటనలో ఉపయోగించిన బైక్‌లు ప్యాషన్ ప్లస్, ఎఫ్‌జెడ్ మోడల్స్‌గా పోలీసులు గుర్తించారు. డబ్బు హవాలా నగదై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అలాగే డబ్బు తరలింపు సమాచారం ముందుగానే తెలిసిన వ్యక్తులే ఈ దోపిడీకి పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన అనంతరం పోలీసులు బాధితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డబ్బు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరిది? వంటి వివరాలను సేకరిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో నగరంలో భద్రతా వ్యవస్థపై మరోసారి చర్చ మొదలైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# అటు రంగస్థలం.. ఇటు విద్యావనం







నాటకాన్ని ప్రేమించి, నటుడిగా శ్రమించి, నిరంతరం నాటక కళామతల్లి సేవలో పునీతమవుతున్న కళాకారుడు కూనపరెడ్డి సత్యనారాయణ. ఒక్కపక్క రంగస్థలంలో రాణిస్తూనే- మరోపక్క విద్యారంగంలోనూ విలువైన సేవలు అందిస్తున్నారు. విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఐదు దశాబ్దాలకు పైగా రంగస్థల నటుడిగా ఆయన రాణిస్తున్నారు. నటనలో ఎన్టీఆర్, ఎస్వీఆర్, ఏఎన్నార్‌లను అనుకరించే ఆయన పౌరాణిక నాటకాల ప్రదర్శనలను బాగా ఇష్టపడతారు. కంచుకంఠంతో డైలాగుల డెలివరీలో స్పష్టత ప్రదర్శిస్తారు. ఏ పాత్రలోనైనా ఒదిగిపోయి జీవిస్తారు. కళాకారుడిగా తనకు నచ్చి, మెచ్చిన నాటక రంగ ప్రదర్శనలు ఎక్కడ జరిగినా వెళ్లి పాల్గొంటారు. తనదైన శైలిలో హావభావాలు ప్రదర్శిస్తూ శభాష్ అని పిలిపించుకుంటారు.

కృష్ణాజిల్లా పెడన మండలం చెన్నూరు గ్రామానికి చెందిన కూనపరెడ్డి వెంకమ్మ, నాగేశ్వరరావు దంపతుల కుమారుడు సత్యనారాయణ. చెన్నూరు గ్రామం కళాకారులకు పుట్టినిల్లు. ఆ గ్రామంలో గతంలో ప్రతి ఇంట్లో ఒక కళాకారుడు ఉండేవారు. ఆయన తండ్రి నాగేశ్వరరావు శ్రీరామాంజనేయుద్ధంలో యయాతి, రామాంజనేయ యుద్ధంలో బూరికీర్తి, కురుక్షేత్రంలో ధర్మరాజు పాత్రల్లో దిట్ట. తండ్రిలోని గాత్రం, నటనాశైలిని పుణికిపుచ్చుకున్న సత్యనారాయణ తనకంటూ సరికొత్త ఒరవడితో నాటక రంగ కళాకారుడిగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందారు. ప్రముఖ రంగ స్థల నటులు ఆచంట వెంకటరత్నం నాయుడు గాత్రాన్ని సత్యనారాయణ అన్వయిస్తూ పద్యాలు అవలీలగా పాడతారు. విజయనగరానికి చెందిన బి.రామచంద్రరావు నాయుడు స్ఫూర్తితో ఆయన విశ్వామిత్ర పాత్రను ఎంపిక చేసుకున్నారు. విశ్వామిత్ర రాజరుషి పాత్రలో వికటాట్టహాసం కాకుండా అవసరం మేరకే రాగాలాపన చేస్తారు. డైలాగుల డెలివరీలోనూ, పద్యాల ఆలాపనలోనూ స్పష్టతతో కంచుకంఠంతో ఆలపించేవారు. పదాన్ని విడమర్చి చెప్పటంలోనూ దిట్ట. మహానటులు ఎన్టీఆర్, ఎస్వీఆర్ వంటి సినీరంగ ప్రముఖుల సినిమాలను వీక్షిస్తూ వారిని అనుకరించేవారు. డైలాగుల డెలివరీ అచ్చు వారిలాగే ఉండేది. పద్యాలు ఆలపించటంలోనూ, రాగాలు తీయటంలోనూ, హావభావాలను ప్రదర్శించటంలోనూ సరికొత్త ఒరవడి ప్రదర్శించారు. సత్యనారాయణ తన 11వ ఏటనే పాఠశాలలోని వివిధ వేదికలపైన తన నటనను ప్రదర్శించి ఉపాధ్యాయులు, తోటి విద్యార్థుల నుంచి అభినందనలు అందుకున్నారు. తెలుగు పండితులు మద్దూరి రామ్మోహనరావు ఆయన నటనా కౌశలాన్ని ప్రోత్సహించి అనేక నాటికల ప్రదర్శనలకు అవకాశం కల్పించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యను చెన్నూరు ప్రభుత్వ పాఠశాలలోనూ, ఐటిఐ, డిప్లమోను కాకినాడలో పూర్తిచేశారు. అనంతరం ధవళేశ్వరంలో సాంకేతిక విద్యకు సంబంధించిన శిక్షణను పూర్తిచేశారు. అటు కళాశాలఉద్యోగం, ఇటుకళారంగంలో ప్రతిభను సుసంపన్నం చేసుకు న్నారు. ఎందరో విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ మార్గ దర్శకులుగా నిలిచారు. ఐటిఐ కళాశాలలో అధ్యాపక వృత్తి చేపట్టి కళాశాల ప్రిన్సిపల్‌గా స్థిరపడ్డారు. ఆ తర్వాత ఎస్‌పిఎఎం ఐటిఐ కళాశాలను స్థాపించి ఏటా వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.ఏడు పదుల వయస్సులోనూ నాటక ప్రదర్శనల్లో చురుగ్గా పాల్గొంటూ తనలోని కళాపిపాసను బయటపెడుతున్నారు. ఎక్కడ నాటక కళాప్రదర్శనలు జరిగినా వెళ్లి వీక్షిస్తూ వాటిని ప్రోత్సహించటంలోనూ ఆయన ముందుంటారు. కళాకారుడిగా పలు పాత్రల్లో ఆయన నటించి మెప్పిస్తున్నారు. పాత్ర ఏదైనా పరిణిత నటనతో అందులో జీవించటం ద్వారా ఉత్తమ నటుడిగా అనేక పురస్కారాలు, అభినందనలు అందుకున్నారు. పౌరా ణిక నాటకాల్లో సత్యహరిశ్చంద్రలో విశ్వామిత్రునిగా, రామాంజనేయ యుద్ధంలో లక్ష్మణుడిగా ఆయన నటనా కౌశలం అద్భుతం. పల్లెపడుచు, చిల్లరకొట్టు చిట్టెమ్మ, పూలరంగడు సాంఘిక నాటకాల్లో ఆయన కనబర్చిన నటన అద్వితీయం. జై శ్రీ నాట్యమండలి అధినేత కీర్తిశేషులు కొడాలి వీరాంజనేయులు గారి కుమారుడు కొడాలి రాజా వద్ద పౌరాణిక నాటకాల్లో నటనా ప్రావీణ్యం పొంది దుద్దుకూరి సాయి బాబు, కోరుకొల్లు నాని ప్రోత్సాహంతో జూనియర్ డివి సుబ్బారావు, పద్మశ్రీ వై.గోపాలరావు, ఉప్పాల నాంచారయ్య, ఉప్పలపాటి సైదులు, పి.లక్ష్మణరావు, బెండపూడి రామారావు, కిలారు లక్ష్మి, జయ నిర్మల, బొబ్బిలి సావిత్రి, ఎ.వెంకటేశ్వరరావు, పి.వి.రామాంజనేయులు మొదలైన వారితో కలిసి నటించారు. పౌరాణిక సంస్థల దిగ్గజాల చేత కొన్ని వందల ప్రదర్శనలు ఇచ్చి మెప్పించారు. విద్యావేత్తగా, విద్యాసంస్థ అధినేతగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో ఆయన తన వంతు పాత్ర పోషిస్తున్నారు. పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు ఉపాధి శిక్షణకు అవసరమైన కోర్సులు ఎంపిక చేసుకునేలా 'స్పామ్' ఐటిఐను ముదినేపల్లిలో ఏర్పాటు చేశారు. గత 30 సంవత్సరాలుగా అత్యుత్తమ విద్యాప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తున్నారు. కళా,సాంస్కృతిక, భాషా రంగాల్లో అపారమైన అనుభవం, ప్రజ్ఞ ఉన్న ఆయన నిరంతరం కొత్త విషయాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ తమ కళాశాలలో చదివే విద్యార్థినీ విద్యార్థులను ఉపాధి శిక్షణలో సరికొత్త ఒరవడి, నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు. కోర్సు పూర్తయిన వెంటనే జీవనోపాధి పొందేలా ఉపాధి, నైపుణ్య కోర్సుల్లో వారిని ప్రోత్సహిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉపాధి కల్పనా శాఖల ద్వారా ఇచ్చే శిక్షణల్లోనూ పాల్గొనేలా చేస్తున్నారు.

## ప్రజల ముంగిటకే మెరుగైన వైద్య సేవలు: జిల్లా కలెక్టర్ రాజర్షిషా




**ఆదిలాబాద్,తెలంగాణదిశ:** గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా తలమడుగు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మిత్ర ఎన్జీఓ సహకారంతో ఏర్పాటు చేసిన రూ. 2 లక్షల విలువైన నూతన వైద్య పరికరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్య శిబిరాల ద్వారా వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, అవసరమైన చికిత్సను అక్కడికక్కడే అందించాలని సిబ్బందిని ఆదేశించారు. చిన్న చిన్న అనారోగ్య సమస్యలను సకాలంలో పరిష్కరించకపోతే అవి భవిష్యత్తులో ప్రాణాంతక వ్యాధులుగా మారే ప్రమాదం ఉందని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గర్భం దాల్చిన నాలుగు లేదా ఐదు నెలల సమయంలో తప్పనిసరిగా 'టిఫా' స్కాన్ చేయించడం ద్వారా శిశువుల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు. దీనివల్ల ప్రసవ సమయంలో తలెత్తే ఇబ్బందులను అరికట్టి తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉండి, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. దీంతో పాటు, దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ మరియు టీబీ బాధితులకు క్రమం తప్పకుండా మందులు పంపిణీ చేయాలని, తద్వారా కిడ్నీ, లివర్ వైఫల్యాల వంటి తీవ్ర సమస్యలను నివారిం చవచ్చని స్పష్టం చేశారు. ప్రస్తుతం 12 గంటలు అందుబాటులో ఉన్న పీహెచ్‌సీ సేవలను భవిష్యత్తులో 24 గంటలకు విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నామని, ఎన్‌క్వాస్ గుర్తింపు సాధించడం ద్వారా ఆసుపత్రికి అదనపు నిధులు, వసతులు సమకూరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ రీజనల్ మేనేజర్ రామచంద్ర రావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఉత్పల్ కుమార్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, తహసీల్దార్ రాజ్ మోహన్, డాక్టర్ హరీష్, శ్రీధర్, ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామస్తులు, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# చిట్టి చేతులతో చిన్నచిన్నగా..
# పిల్లలకు ఆర్థిక పాఠాలు చెప్పండిలా



మనలో చాలామంది.. పిల్లలకు ఓ వయసు వచ్చాకగానీ ఆర్థికపరమైన అంశాల జోలికి వెళ్లనివ్వం. అందుకే నేడు మెజారిటీ యువతకు కుటుంబ ఆర్థిక పరిస్థితులపై సరైన అవగాహన ఉండటం లేదంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అయితే పసితనం నుంచే తల్లిదండ్రులు పిల్లలకు ఆర్థిక పాఠాలు నేర్పితే.. వారికి ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. నగదు విలువ, పొదుపు వంటివి చిరుప్రాయంలోనే వివరించగలిగితే.. పెద్దయ్యాక వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంటున్నారు. పాఠ్యపుస్తకాల్లో చదివేదానికంటే జీవితంలో చూసి నేర్చుకునేదే ఎంతో ముఖ్యం మరి. ఇదీ సంగతి: పిల్లలు ఆర్థికపరమైన విషయాలను కేవలం వినడం ద్వారానేగాక.. పెద్దల ప్రవర్తనను చూస్తూ నేర్చుకుంటారు. కనుక తల్లిదండ్రులు ఆర్థిక అంశాలను పిల్లల వద్ద దాచిపెడితే.. వారికి వాస్తవ పరిస్థితులపై అవగాహన కొరవడుతుంది. అందుకే మన ఖర్చులు, సంపాదన ఇలాంటివన్నీ వారికి తెలిసేలా చేయడం ఎంతైనా మంచిది. ఇక మీరు వృథా ఖర్చులు చేస్తూపోతే.. మీ పిల్లలూ అదేవిధంగా తయారయ్యే ప్రమాదం ఉన్నది. అలాగే చిన్న పిల్లలు కదా అని, మారాం చేస్తున్నారని అడిగింది ఇస్తూపోతే డబ్బు విలువ తెలియకుండాపోతుంది. కాబట్టి ఏది అవసరం? మరేది అనవసరం? అన్నది వారికి తెలియజేస్తూ.. అక్కెరకు వచ్చేవి మాత్రమే అందించాలి. పిల్లలు పెద్ద పెరుగుతున్నప్పుడు సమయం ఉన్నప్పుడల్లా మీ ఆర్థిక ఒత్తిళ్లనూ వారితో పంచుకుంటే.. కుటుంబ ఆర్థిక పరిస్థితులకు తగ్గట్టుగా వారూ నడుచుకుంటారు. ఇక పొదుపు, పిసినారితనానికి మొదట్లో చిన్న గీతే అడ్డుగా ఉంటుంది. ఆ గీతకున్న అర్థం పిల్లలకు తొలినాళ్ల నుంచే తల్లిదండ్రులు వివరించినైట్టైతే.. మనవారు పూర్తిగా డబ్బు మనుషులు కాకుండా కూడా జాగ్రత్తపడవచ్చు. పెట్టుబడులతోపాటు బీమా అవసరాన్నీ తెలియజెప్పాలి. అప్పుడే సరైన ఆర్థిక ప్రణాళికల్ని వేసుకునే సామర్థ్యం వారికి ఉంటుంది. ఏవైనా ఎదురు దెబ్బలు తగిలినప్పుడు ఎలా నిలదొక్కుకోవాలి, కుటుంబం అండకు ఎంత ప్రాధాన్యం ఉంటుంది.. అన్నదీ పిల్లలకు వివరిస్తూపోతే భవిష్యత్తులో ఆర్థికపరంగానూ, కుటుంబపరంగానూ బలంగా తయారవ్వగలరు.

# కొబ్బరికి యుద్ధ కష్టాలు



**కాకినాడ,తెలంగాణ దిశ :** కొబ్బరి అనగానే కేరళ తరువాత కోనసీమ గుర్తుకు వస్తుంది. కోనసీమ వ్యాప్తంగా కొబ్బరి ఎగుమతులకు పెట్టింది పేరు. ఇక్కడి నుంచి ప్రతీ రోజూ టన్నుల కొద్దీ కొబ్బరి స్వదేశీ మార్కెట్‌కే కాక ఇతర దేశాలకు ఎగుమతులు అవుతుంటాయి. అయితే మిడిల్ ఈస్ట్‌లో జరుగుతోన్న ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ప్రభావం ఈ కొబ్బరి మార్కెట్ పైన కూడా పడిందంటున్నారు కొబ్బరి వ్యాపారులు. ఈ పరిస్థితి ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లాతోపాటు తమిళనాడు, కేరళ మార్కెట్లపై తీవ్ర ప్రభావం ఉంటుందంటున్నారు. కొబ్బరి సాగుకు దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తమిళ నాడు, కేరళ, కర్ణాటక పెట్టింది పేరు. గతంలో దేశీయ మార్కెట్‌లోనే కొబ్బరి ఎగుమతులు ఉండగా కొన్నేళ్లుగా మన దేశీయ కొబ్బరికి మిడిల్ ఈస్ట్ దేశాల్లో బాగా డిమాండ్ పెరిగింది. ముఖ్యమంగా ఏపీ, తమిళనాడు ప్రాంతాల నుంచి గల్ఫ్ దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయంటున్నారు. రంజాన్ మాసం కావడంతో కొబ్బరికి డిమాండ్ ఏర్పడింది. సాంప్రదాయ వంటకాల్లో కొబ్బరిని ఎక్కువగా వాడుతున్నారని, దీంతోపాటు ఆదేశ సౌందర్య, ఇతరాత్ర తయారీ సామాగ్రిలో కొబ్బరి వినియోగం బాగా పెరిగిందంటున్నారు. కువైట్, ఒమన్, దుబాయ్, ఇరాన్, సౌదీకి కొబ్బరి ఎగుమతులు జరుగుతుండగా ఆ దేశాలకు ఎగుమతులు చేసేందుకు అంతా సిద్ధం చేశారు.ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ దేశాల్లో యుద్ధ వాతావరణంతో గుబులు పుట్టిస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సేనలు విరుచకుపడుతున్నాయి. మరో పక్క దుబాయ్, కువైట్, సౌదీ అరేబియా, ఒమాన్, బెహ్రాయిన్ దేశాలపై ఇరాన్ డ్రోన్లతో దాడులు చేస్తుంది. ఈ పరిస్థితుల్లో ముంబయి, చెన్నై, తూత్తుకూడి పోర్టుల్లోనే కొబ్బరి కాయలతో కంటెయినర్లు నిలిచిపోయాయని అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌కు సంబందించిన కొబ్బరి వ్యాపారులు, రైతులు చెబుతున్నారు.యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో.. ఆయా దేశాలకు ఎగుమతులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందంటున్నారు. ఆయా ఓడరేవుల్లో ఉన్న సరకును స్థానికంగా తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, ధరల పతనంతో తీవ్రంగా నష్టపోతున్నామంటున్నారు. గత నెలలో శివరాత్రి సందర్భంగా కోనసీమ కొబ్బరి మార్కెట్లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయని, వెయ్యి పచ్చి కాయలు రూ.18-20 వేలు పలికాయని రైతులు వెల్లడించారు. కురిడీల ధరలూ బాగానే ఉండగా శ్రీరామనవమికి దేశవ్యాప్తంగా మంచి ధర వస్తుందని వ్యాపారులు ఆశించారు. ఓడరేవుల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్లే కొబ్బరికాయలు అక్కడే నిలిచిపోవడంతో ధరలపై ప్రభావం చూపిందంటున్నారు. దీంతో ప్రస్తుతం వెయ్యి కాయలు రూ.13-14 వేలకు పతనమయ్యా యని వ్యాపారులు రైతులు అంటున్నారు. ఏపీలో కొబ్బరికి ప్రసిద్ధి చెందిన కోనసీమ జిల్లా అంబాజీపేటలో కొబ్బరికి పెట్టింది పేరు. అలాంటి ప్రాంతం నుంచి రోజు ఇతర రాష్ట్రాలకు పదుల సంఖ్యలో లారీలు ఎగుమతి అయ్యేవి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎగుమతులు పూర్తిగా పడిపోయి కొబ్బరి పచ్చికాయ కురిడికాయ ధరలు అమాంతంగా పడిపోవడంతో అటు వ్యాపారులు ఇటు రైతులు ఆవేదన చెందుతున్నారు.

# ఆశ్రయమిచ్చిన ఇంటికే కన్నం

### మత్తు మందు ఇచ్చి దోపిడీ చేసిన బంధువు
### 24 గంటల్లోనే పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**బంధువే కదా ఆశ్రయమిస్తే రాబంధువుగా మారి దోచుకున్నది. ఇంట్లో చోటిచ్చిన పాపానికి బంగారు నగలు, డబ్బు అంతా ఊడ్చుకెళ్లింది. ఆ కిలాడీ లేడీ అంతర్గతంగా వేసిన స్కెచ్ గుర్తు పట్టని ఆ దంపతులు.. సొమ్ము పోయిన తర్వాత లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. సీన్ కట్ చేస్తే జస్ట్ 24 గంటల్లోనే కిలాడీ లేడీని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన హైదరాబాద్‌లో జరిగింది. బీహెచ్ఈఎల్ కాలనీ పరిధిలోని ఆదర్శనగర్‌లో పురోహితులైన యర్రవల్లి మణికంఠశర్మ, హేమబిందు దంపతుల ఇంటికి వచ్చింది ఓ మహిళ. ఆమె పేరు చెరకుపల్లి లక్ష్మి స్వరాజ్. తాను తీవ్రమైన ఆర్థిక కష్టాల్లో ఉన్నానని, ఉండటానికి చోటు లేక ఇబ్బంది పడుతున్నానని ప్రాధేయపడింది. బంధుత్వంపై ఉన్న గౌరవం.. ఆమె పరిస్థితిపై ఉన్న జాలితో ఆ దంపతులు ఆమెకు తమ ఇంట్లోనే ఉండేందుకు ఆశ్రయం ఇచ్చారు. కొన్ని రోజులు.. ఆ దంపతుల నమ్మకాన్ని గెలుచుకుంది లక్ష్మిస్వరాజ్. వారి ఇంట్లో ఒక మనిషిగా ఉన్నట్లుగానే మెదిలింది. కానీ ఆ తర్వాత ఆమె తన కన్నింగ్ ఆలోచనలకు తెరతీసింది. ఇంట్లో ఉన్న విలువైన ఆభరణాలపై కన్నేసింది. మార్చి 13న వాటిని కొట్టేసేందుకు ప్లాన్ చేసింది. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం.. ఆ దంపతులకు నిమ్మరసంలో మత్తు పదార్థం కలిపి ఇచ్చింది. ఆ పానీయం తాగిన కొద్దిసేపటికే మణికంఠశర్మ, హేమబిందు ఇద్దరూ స్పృహ కోల్పోయారు. వారు అపస్మారక స్థితిలోకి వెళ్లగానే.. లక్ష్మిస్వరాజ్ తన ముఠా సభ్యులైన పర్వతం కిరణ్‌కుమార్, కోనపర్తి యశ్వంత్, భారడి దీపక్, శివను ఆ ఇంటికి రప్పించింది. ముఠా సభ్యులతో కలిసి ఇంట్లోని అల్మారాలను బద్దలుకొట్టి దాదాపు 30 తులాల బంగారం, 2.3 కిలోల వెండి, 3 ఖరీదైన సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. బాధితులు స్పృహలోకి వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉండటం.. లక్ష్మిస్వరాజ్ కనిపించకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు వెంటనే బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


# ఘజియాబాద్‌లో దారుణ ఘటన

### బ్యాంక్ మేనేజర్‌రు కాల్చి చంపిన సెక్యూరిటీ గార్డ్

న్యూఢిల్లీ: ఘజియాబాద్‌లో ఓ సెక్యూరిటీ గార్డు ఘాతుకానికి పాల్పడ్డాడు. సెలవులు, జీతం విషయంలో విభేదాలు రావడంతో అందరూ చూస్తుండగా బ్యాంక్ మేనేజర్‌ను కాల్చి చంపాడు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఘజియాబాద్‌లోని పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లో రవీంద్ర హుడా అనే వ్యక్తి సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతడికి సెలవుల గురించి తరచుగా బ్యాంక్ మేనేజర్ అభిషేక్ కుమార్ (34)తో విభేదాలు తలెత్తుతుండేవి. ఎప్పుడు అడిగినా మేనేజర్ సెలవు తిరస్కరిస్తుండడంతో అతడిపై రవీంద్ర తీవ్రంగా కోపం పెంచుకున్నాడు. రాత్రి అభిషేక్ క్యాబిన్‌లోకి వెళ్లిన రవీంద్ర, తుపాకీతో అతడిపై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన అభిషేక్‌ను ఇతర సిబ్బంది హాస్పిటల్‌కు తరలించారు. అయితే అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు వెంటనే రవీంద్రను అదుపులోకి తీసుకున్నారు.

మేనేజర్ హత్యలో రవీంద్రకు సహకరించిన శిశుపాల్‌ను కూడా అరెస్ట్ చేశారు.తాను ఎప్పుడు లీవ్ అడిగినా మేనేజర్ నిరాకరించేవాడని, బ్యాంక్‌కు రాని రోజును సెలవుగా పరిగణించకుండా జీతం కట్ చేసేవాడని, ఆ కోపంతోనే అతడిని కాల్చి చంపానని పోలీసుల విచారణలో రవీంద్ర తెలిపాడు. సెలవుల విషయంలో మేనేజర్‌తో తరచుగా తనకు గొడవలు జరుగుతుండేవని చెప్పాడు. తాను కాల్పులు జరిపిన సమయంలో స్నేహితుడు శిశుపాల్ పక్కనే ఉన్నట్టు కూడా పోలీసుల విచారణలో రవీంద్ర చెప్పాడు. ఆర్మీలో పని చేసి 2018లో రిటైర్ అయిన రవీంద్ర బ్యాంక్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా జాయిన్ అయ్యాడు.

# ప్రభాస్ ..ఫౌజీ దసరాకు పక్కా






ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రెబల్ స్టార్ ప్రభాస్ .. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించేందుకు సిద్ధమవుతున్నాడు. అందులో హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హిస్టారికల్ వార్ డ్రామా 'ఫౌజీ' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను ఈ ఏడాది దసరాకు రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. అయితే, అనుకున్న సమయానికి షూటింగ్ ఫినిష్ అవడం కష్టమని, ఫలితంగా పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఏది ఏమైనా సరే ఈ చిత్రాన్నివిజయదశమి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ గట్టిగా ఫిక్స్ అయ్యారట. దసరా సీజన్ టాలీవుడ్‌లో అతిపెద్ద సినిమాలకు కలిసొచ్చే సమయం కావడంతో, ఆ లోపే పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు హను రాఘవపూడి విజన్‌పై పూర్తి నమ్మకంతో ఉన్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ, ఆయనకు పూర్తిగా 'ఫ్రీ హ్యాండ్' ఇచ్చినట్లు తెలుస్తోంది. టెక్నికల్ వాల్యూస్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, అనుకున్న సమయానికి అవుట్‌పుట్ తీసుకురావడమే లక్ష్యంగా టీమ్ పనిచేస్తోంది. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే.. ఈ ఏడాది జూలై లేదా ఆగస్టు లోపు షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంతో ఇమాన్వీ హీరోయిన్‌గా టాలీవుడ్‌కి పరిచయం అవుతోంది. మొత్తంగా.. ఈ సినిమాతో ప్రభాస్ మరోసారి పాన్ ఇండియా లెవల్లో సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.


# 'కెడి డెవిల్' సాంగ్ వివాదం.. డబుల్ మీనింగ్ లిరిక్స్‌పై నెటిజన్ల ఆగ్రహం





"కాదేది బూతుకు అనర్హం" అన్న సినీ కవి మాటలను నిజం చేస్తూ కొందరు సినిమాల్లో బోల్డ్ కంటెంట్ పెంచుతున్నారని విమర్శలు వస్తున్నాయి. తాజాగా కన్నడ పాన్ ఇండియా చిత్రం 'కెడి డెవిల్' నుంచి విడుదలైన 'సర్కే చునర్ తేరి సర్కే' పాట ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ పాట హిందీ వెర్షన్‌ను తెలుగు ప్రముఖ గాయని మంగ్లీ ఆలపించారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. ఎందుకంటే ఇదే బ్యానర్ నుంచి త్వరలో 'జన నాయకుడు', 'టాక్సిక్', అలాగే మెగాస్టార్‌తో దర్శకుడు బాబీ కొల్లి చేయబోయే సినిమా కూడా రాబోతున్నాయి. దీంతో 'కెడి డెవిల్'పై కూడా భారీ హైప్ ఏర్పడింది. అయితే తాజాగా విడుదలైన ఈ పాట మాత్రం వివాదానికి కేంద్రంగా మారింది. రకీబ్ ఆలం రాసిన సాహిత్యంలో ఎక్కువగా ద్వందార్థాలు ఉన్నాయని నెటిజన్లు విమర్శిస్తున్నారు. సినిమాలో విలన్ పాత్రలో నటిస్తున్న సంజయ్ దత్‌ని ఉద్దేశించి ఐటెం గర్ల్ నోరా ఫతేహి పాడుతున్నట్టుగా ఈ పాటను చిత్రీకరించారు. బోల్డ్ లిరిక్స్‌తో పాటు చిత్రీకరణ కూడా ఘాటుగా ఉండటంతో ఇది మరింత విమర్శలకు కారణమైంది.ఇప్పటికే సోషల్ మీడియాలో ఈ పాటపై ట్రోలింగ్ మొదలైంది. ఇలాంటి పాటలను చిన్నపిల్లలు రీల్స్‌లో అనుకరిస్తే బాధ్యత ఎవరిది? అంటూ పలువురు నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఈ వివాదం ఇంకా పెద్దదయ్యే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ధృవ్ సర్జా హీరోగా నటించిన ఈ యాక్షన్ డ్రామాకు దర్శకుడు ప్రేమ్ దర్శకత్వం వహించారు. దాదాపు మూడు సంవత్సరాలుగా ఈ సినిమా నిర్మాణంలో ఉంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీని వేసవి సీజన్‌లో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నారు. అయితే గతంలో ధృవ్ సర్జా నటించిన 'మార్టిన్' సినిమా ఘోరంగా విఫలం కావడంతో ఆ ప్రభావం 'కెడి డెవిల్'పై పడిందని బెంగళూరు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక నిర్మాణ సంస్థ కెవిఎన్ ప్రొడక్షన్స్ ప్రస్తుతం పలు సమస్యలతో సతమతమవుతోంది. 'జన నాయకుడు' సినిమా విడుదల తేదీ ఇంకా ఖరారు కాకపోవడం, వడ్డీల భారం పెరగడం, ఓటీటీ డీల్ ఆగిపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. మరోవైపు 'టాక్సిక్' సినిమా కూడా మార్చి నుంచి జూన్‌కు వాయిదా పడింది. ఈ పరిస్థితుల్లో 'కెడి డెవిల్' సాంగ్‌పై వచ్చిన ఈ కొత్త వివాదం ఎంత దూరం వెళ్తుందో చూడాలి.

# సంక్షోభంలో ఉపాధ్యాయ వృత్తి..?



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు క్షీణిస్తున్నాయని నేషనల్ అచీవ్‌మెంట్, పాఠశాలల పనితీరు గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ), ఎస్‌సీఈఆర్‌టీ సర్వేలు తెలుపుతున్నాయి. పీజీఐ ప్రకారం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలిపి 36 ఉండగా, వాటిలో మన రాష్ట్రం 21వ స్థానంలో నిలిచింది. అభ్యసనా ప్రమాణాల్లో 35వ స్థానంలో ఉన్నది. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ప్రకారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సామర్థ్యం 50 శాతం కంటే తక్కువ ఉన్నది. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల విద్యాసామర్థ్యాలూ కొంచెం అటు ఇటుగా ఉన్నాయని సర్వేల నివేదికలు చెప్తున్నాయి.

విద్యార్థులకు సరైన సామర్థ్యాలు లేకపోవడానికి గల కారణాలు ఏమిటనే అభిప్రాయంతో ఇటీవల పాఠశాల విద్యాశాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, యూనిసెఫ్ అధ్యయనం చేశాయి. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగిస్తుండటంతో కీలకమైన బోధన సమయాన్ని కోల్పోతున్నారు. దానివల్ల విద్యార్థులకు నష్టం జరుగుతున్నది. పాఠాలు బోధించాల్సిన సమయంలో ఉపాధ్యాయులకు ఫోన్లు వస్తుంటాయి. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు.. ఇలా ఏదో ఒక డేటా అడుగుతారు. దానివల్ల ఉపాధ్యాయులు బోధన పట్ల ఏకాగ్రతను కోల్పోతున్నారు. అందుకు ప్రభుత్వమే కారణం. ఉపాధ్యాయులు తరగతి గదికే పరిమితమయ్యే పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగానిదే. పాఠశాల పనిదినాల్లో తరగతి గదిలో బోధించే పనిలో ఉపాధ్యాయుడు, వారి బోధనను పర్యవేక్షించే విధుల్లో పర్యవేక్షణాధికారి ఉండాలి. కానీ, అలా జరగకపోవడంతో విద్యాపాలన చిన్నాభిన్నమైంది.

'ఉపాధ్యాయులు ఉద్యోగాలు వదిలి వెళ్లిపోతున్నారు- కొందరు మౌనంగా, మరికొందరు ఉద్యోగంలో ఉన్నప్పటికీ మానసికంగా వైదొలుగుతున్నారు. యువతరం అసలు ఉపాధ్యాయులుగా రావాలనే కోరుకోవడం లేదు'- అని విద్యావేత్త, జాతీయ విద్యాపరిశోధన శిక్షణా సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) పూర్వ సంచాలకులు ఎన్.కృష్ణకుమార్ అన్నారు. ఇట్లా ఎందుకు జరుగుతున్నది సిలబస్ పూర్తి చేయాలనే తీవ్ర ఒత్తిడి ఉపాధ్యాయులపై ఉన్నది.

తల్లిదండ్రుల అవాస్తవ అంచనాలు ఒత్తిడిని పెంచుతున్నాయి. సబ్జెక్టులు, పనిభారం పెరిగిపోయాయి. గురుశిష్యుల మధ్య బంధం ఒకప్పుడు విద్యకు గుండెకాయ లాంటిది. కానీ, ఇప్పుడు డేటా, గడువుల కింద అది సమాధి అయిపోయింది. బోధన కంటే డేటా సేకరించి పంపడమే కీలకమైపోయింది. విద్యార్థులు ఇప్పుడు ఉపాధ్యాయులను సేవలందించేవారిగా మాత్రమే చూస్తున్నారు. వారిపై గౌరవమూ తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా పాఠశాలల్లో ఒక నిశ్శబ్ద విప్లవం జరుగుతున్నది. అది ఉపాధ్యాయుల మనసుల్లో నెలకొన్న అలసట, నిస్పృహాయత, నిరాశలతో కూడినది.

ఉపాధ్యాయులు బోధనకు దూరంగా వలసపోవడాన్ని రెండు దశాబ్దాల కిందటే యునెస్కో గుర్తించింది. అందుకే ఉపాధ్యాయులు ఎటు పోతున్నారంటూ తన అధికార పత్రిక ప్రాస్పెక్ట్స్‌లో విద్యపై జరిగే త్రైమాసిక సమీక్షలో ప్రశ్నించింది.

పాఠశాల తరగతి గది పరిస్థితులకు సంబంధించిన అంశాలను, విద్యార్థి ప్రవర్తనను ప్రభావితం చేసే గృహ వాతావరణం వంటివి ఇందుకు కొన్ని కారణాలైనప్పటికీ, మన దేశంలో ఈ దిశగా అధ్యయనమే జరగలేదు. ఆ క్రమంలోనే యునెస్కో, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, పాఠశాల విద్యాశాఖ మన రాష్ట్రంలో జరిపిన అధ్యయన నివేదికను బయటపెట్టింది.

'తరగతి గదిలో దేశ భవిష్యత్తు రూపుదిద్దుకుంటుంది' అన్న విద్యావేత్త కొఠారి ఉపాధ్యాయుల వేతనాలు, పని పరిస్థితులు, పదోన్నతులపై కూడా తన అభిప్రాయాలను సిఫారసుల రూపంలో చెప్పారు. దేశంలోని మిగతా వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తికి అధిక వేతనాలుండాలని, మెరుగైన పదోన్నతి విధానాలుండాలని ఆయన సిఫారసు చేశారు. కానీ, ఆరు దశాబ్దాలైనా

ఉపాధ్యాయుల వేతన వ్యవస్థ మెరుగుపడలేదు సరికదా.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, అవర్ లీ బేస్డ్ పద్ధతిలో అతి తక్కువ జీతాలకు ఉపాధ్యాయుల నియామకాలు జరుగుతున్నాయి. ఇన్ని అవలక్షణాలతో ఉన్న ఉపాధ్యాయ వృత్తిని యువకులు ఎందుకు ఆదరించాలి

ప్రస్తుత డీఈవోలలో బోధనేతర సిబ్బందే ఎక్కువగా ఉన్నారు. పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతను ఉపాధ్యాయులకే అప్పగించాలని, విద్యార్థులతో నేరుగా సంబంధం ఉండే మండల విద్యాధికారి, డిప్యూటీ విద్యాధికారి పోస్టులనూ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని 1992లో సుందరేశన్ ఏకసభ్య కమిటీ సిఫారసు చేసింది. ఈ సిఫారసులను గమనంలోకి తీసుకోవాలి. డీఈవో, జాయింట్ డైరెక్టర్ లాంటి పోస్టుల్లోనూ ఉపాధ్యాయులకు భాగస్వామ్యం లభిస్తే వారు తమకున్న బోధనానుభవం, విద్యాతత్వశాస్త్ర, విద్యామనస్తత్వశాస్త్ర అవగాహనతో పాలనా చర్యలు తీసుకోగలుగుతారు.

విద్యా విధానంలో పరివర్తన తీసుకురావడం అర్హులైన ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుంది. అయితే వారికి సమాజం నుంచి తగిన గౌరవం, సంతృప్తికరమైన వేతనం అందితేనే వారిలో ప్రేరణ సజీవంగా ఉంటుంది. ప్రభుత్వ విద్యాసంస్థలను

అన్నిరకాల వసతులతో అభివృద్ధి చేసి, పటిష్ఠ పర్యవేక్షణతో, జవాబుదారీతనంతో కూడిన ఉన్నత ప్రమాణాల విద్యను అందిస్తామని తల్లిదండ్రులకు ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వాలి. అప్పుడే అందరికీ విద్యాప్రమాణాలతో కూడిన విద్య అందుతుంది.




# నో హెల్మెట్, నో పెట్రోల్

తిరుపతి, : తిరుపతిలో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు నుండి పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ పోయరు. రోడ్డు ప్రమాద సంబంధిత మరణాలను తగ్గించడానికి జిల్లా పోలీసులు 'నో హెల్మెట్‌నో పెట్రోల్' నియమాన్ని కఠినంగా అమలు చేయనున్నారు.జాతీయ రోడ్డు ప్రమాదాల డేటా ప్రకారం దాదాపు 45 శాతం ప్రమాద మరణాలు ద్విచక్ర వాహనదారుల వల్లే సంభవిస్తున్నాయని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. అతివేగం, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం ఈ మరణాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయన్నారు.వాహనదారుడు, పిలియన్ రైడర్ ఇద్దరూ హెల్మెట్లు సరిగ్గా ధరిస్తే ఇలాంటి మరణాలలో 40 శాతం నివారించవచ్చని ఎస్పీ అన్నారు. రోడ్డు ప్రమాద మరణాలు కుటుంబంపై మానసికంగానే కాకుండా ఆర్థిక భారాన్ని కూడా కలిగిస్తాయన్నారు. దీనికి సంబంధించి, తిరుపతి జిల్లా పోలీసులు జిల్లా అంతటా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను ప్రారంభించారు. ఇవి డిసెంబర్ 15 వరకు కొనసాగుతాయి.ప్రజలు ఈ నియమాన్ని అర్థం చేసుకోవడానికి, పాటించడానికి మేం తగినంత సమయం ఇస్తున్నాం. రైడర్, పిలియన్ రైడర్ ఇద్దరూ హెల్మెట్ ధరించడం తప్పనిసరి. తర్వాత, హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుం టాం.' అని ఎస్పీ అన్నారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న పెట్రోల్ పంపుల యజమానులకు ఈ అమలు ప్రణాళిక గురించి ఇప్పటికే సమాచారం అందించారు తిరుపతి పోలీసులు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్ పోయకూడదని, ఈ మేరకు పోలీసులకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.ఏపీలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. నవంబర్ 5వ తేదీ దాకా సగటున రోజుకు 50 ప్రమాదాలు జరగ్గా.. అందులో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. 53 మంది వరకు క్షతగాత్రులు అవుతున్నారు. వాహనాలు అతివేగంగా వెళ్లడం కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో అధిక ప్రమాదాలు ఉన్నాయి. క్లిష్టమైన జిల్లాలుగా కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ గుర్తించింది. మరోవైపు ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు నెల్లూరు,తిరుపతి జిల్లాల్లో సుమారు 400మంది ప్రాణాలు కోల్పోయారు.

# విభజనతో పాటే కాశ్మీర్ చిచ్చు



## నాటి పాలకుల దృష్టి లోపం

## సమర్థ నాయకత్వ లోపంతో సమస్యలు

న్యూఢిల్లీ, : బ్రిటిష్ పాలకులు దేశాన్ని విభజించడమే కాకుండా.. అనేక మెలికలు పెట్టి వెళ్లారు. అలాంటి దాంట్లో కాశ్మీర్ సమస్య ఒకటి. నేటికీ అది రావణకాష్టంగా మారడానికి కారణం వారి కుత్సిత రాజకీయ తంత్రమే. వెళుతూవెళుతూ సంస్థానాలను వారి స్వేచ్ఛకు వదిలేసి వెళ్లారు. ఇదే క్రమంలో భారత్ ఆశ్రయం పొంది భారత్‌లో విలీనం కావడానికి కాశ్మీర్ రాజు హరిసింగ్ చేసిన ప్రయత్నాల ను విభజిత పాక్ అడ్డుకుంది. కొంత భాగాన్ని ఆక్రమించడంతో దిక్కులేని స్థితిలో కాశ్మీర్ రాజు భారత్ ఆశ్రయం పొందాడు. అయితే ఆనాటి ప్రధాని నెహ్రూ తాత్సారం, ఉదాసీనత కారణంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య అలాగే ఉండిపోయింది. అలాగే 370 ఆర్టికల్‌తో కొత్తచిచ్చును కూడా నెహ్రూ రాజేశారు. తొలుత కశ్మీర్ రాజు హరిసిం‌గ్ స్వతంత్రంగా ఉంటానని చేసి, పాకిస్థాన్‌తో మమేకం అయ్యేందుకు ప్రయత్నించారు. కానీ వెంటనే తమతో మమేకం కాకపోవడంతో పాకిస్థాన్‌లోని ప్రభుత్వం ఆక్రమిత కశ్మీర్ భాగంలోని గిరిజనులను ఉసిగొలిపితే కశ్మీర్ రాజు హరిసింగ్.. నాటి నెహ్రూ ప్రభుత్వాన్ని శరణు కోరారు. తర్వాత కశ్మీర్ కూడా భారతదేశంలో భూభాగమైనా.. ఆక్రమిత కాశ్మీర్ సమస్యనేటికీ తెగడంలేదు. కాశ్మీర్ రాజు ఒప్పందం మేరకు కాశ్మీర్ యావత్తూ భారత్ భూభాగంగా ఉండాలి. కానీ పాక్ పాలకు తీరు, నాటి భారత్ పాలకుల ముందు చూపు లేకపోవడం కారణంగా నేటికి దానిని రావణ కాష్టంగా మార్చేశాయి. మిలిటెంట్ల చొరబాట్లు, పాక్ సైన్యం అకారణంగా కాల్పులు జరుపడం నిత్యకృత్యంగా మారింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారి తీసింది. మత ఘర్షణల నివారణకే దేశ విభజన వందేండ్ల పోరాటం తర్వాత భారత్ 1947లో వలస పాలకుల నుంచి విముక్తి పొందింది. బ్రిటన్ పార్లమెంట్ స్థానంలో భారత స్వాతంత్ర్య చట్టం అమలులోకి వచ్చింది. ఆగస్టు 15వ తేదీ నుంచి బ్రిటీషువారి పాలన ముగుస్తుందని ఆ చట్టం నిర్దేశించింది. అలాగే దేశాన్ని రెండు సార్వభౌమ దేశాలైన ఐక్య భారత్, అధినివేశ పాకిస్థాన్‌గా విభజించాలని సూచించింది. రెండు దేశాలకు కేటాయించాల్సిన ప్రాంతాల పర్యవేక్షణకు బ్రిటీషు వారు సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్‌ను రంగంలోకి దించారు. వృత్తిరీత్యా న్యాయాధికారి రాడ్‌క్లిఫ్‌ను సరిహద్దు కమిషన్‌కు చైర్మన్‌గా నియమించారు. ఒక దేశాన్ని రెండు స్వతంత్ర దేశాలుగా విడగొట్టే గీత గీయడానికి ఈ కమిషన్‌ను నియమించారు. ఢిల్లీ దేశ విభజన అనంతరం దాదాపు 1.5 కోట్ల మంది తమ నివాస ప్రదేశాలను వదిలి రాడ్‌క్లిఫ్ గీతకు అటూ ఇటూ ప్రయాణిం చారు. వారిలో కొందరు కాలినడకన, మరికొందరు రైళ్లలో, బస్సుల్లో రవాణా వసతి ఏది దొరికితే దానిలో గీత దాటారు. ఈ సందర్భంగా జరిగిన మతోన్మాద మారణకాండలో దాదాపు పదిలక్షల మంది తమ ప్రాణాలు కోల్పోయారు. లక్షల కుటుంబాలు సర్వస్వం కోల్పోయి వీధిన పడ్డాయి. వేల మంది మహిళలపై లైంగిక దాడులు జరిగాయి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215